'కామధేను'లో నేడు పశువుల వేలం

కొండాపురం, జూలై 30 : మండలంలోని చింతలదీవి గ్రామంలో ఉన్న జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రంలో 13 రకాల దేశీయ ఆవు జాతులు, 5 రకాల గేదె జాతులను బుధవారం వేలం నిర్వహిచనున్నట్లు ఆ కేంద్రం జేడీ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 182 పశువులను వేలం నిర్వహిస్తున్నామని, పాల్గొనదలచిన రైతులు ఉదయం 11 గంటల్లోగా రూ.10 వేలు ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో పశువులను దక్కించుకున్న రైతులు మొత్తం నగదును చెల్లించి వారి సొంత ఖర్చులతో స్వగ్రామాలకు తరలించుకోవాలని తెలిపారు.

వత్తాసులపై వేటు

- దేవదాయ శాఖలో ఐదుగురు ఈవోల సస్పెన్షన్
- దండుకున్నది వైసీపీ నేతలు.. బలైంది అధికారులు

దేవుళ్లను, దేవాలయాల ఆస్తులను వదిలిపెట్టని వైసీపీ నేతల పాపం ఆలయాల కార్యనిర్వహణ అధికారుల (ఈవో) పాలిట శాపంగా మారింది. వైసీపీ నేతలతో అంటకాగిన నేరానికి ఐదుగురు ఈవోలపై సస్పెన్షన్ వేటు పడింది. జొన్నవాడ కామాక్షితాయి ఆలయంలో పనిచేసిన ఇద్దరు ఈవోలు, ఉలవపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో పనిచేసిన, చేస్తున్న ఇద్దరు ఈఓలు, వింజమూరు మండలం నల్లగొండ్ల లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈవోను సస్పెండ్ చేస్తూ దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.


వెంకటేశ్వర్లు


గిరికృష్ణ


జానకమ్మ


పీఎస్వీ ప్రసాద్


మల్లికార్జున్

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), జూలై 30 : ఉలవపాడు మండలం వేణుగోపాలస్వామి ఆలయా నికి ప్రకాశం జిల్లా సింగ రాయకొండలో 30 ఎకరాల మెట్ట పొలం ఉంది. ఇందులో ఖరీదైన క్వారీ నిక్షిప్తమై ఉంది. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు ఈ దేవుని భూమిపై కన్నేశారు. సుమారు మూడేళ్లకుపైగా దేవస్థానం భూమిని కుళ్లబొడిచి అక్రమ మైనింగ్ చేసి రూ.కోట్లు దండుకున్నారు. ఈ దోపిడీపై ఆంధ్రజ్యోతి పలుసార్లు కథనాలు ప్రమరించింది కూడా. అయినా దోపిడీ మాత్రం యధేచ్ఛగా సాగిపోయింది. ఈ దోపిడీని అడ్డుకోవాల్సిన ఆలయ ఈఓలు వైసీపీ నాయకుల పెత్తనానికి భయపడ్డారో లేదా ప్రలోభాలకు లొంగిపోయారో తెలియదు కానీ మౌనంగా ఉండిపో యారు. ఆలయ భూమిని సంరక్షించాల్సిన స్థానంలో ఉండి కూడా కనీసం పోలీసులకు, జిల్లా ఉన్నతాధికారు లకు ఫిర్యాదు చేసే సాహసం చేయలేదు. దాని ఫలితం ఇప్పుడు అనుభవి స్తున్నారు. దేవాలయ భూమిని కాపాడే విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియో గాలపై ఆలయ పూర్వ ఈఓ యు.జానకమ్మ, ప్రస్తుత ఈఓ పీఎస్వీ ప్రసాద్‌లను సస్పెండ్ చేశారు.

- బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్న వాడ కామాక్షి తాయి ఆల యంలో కూడా ఇదే జరిగింది. వైసీపీ ముసుగు కప్పుకున్న నాయకులు చేసిన పాపాల్లో చేయి కలిపిన నేరానికి ఇద్దరు ఈఓలపై వేటు పడింది. కామాక్షితాయి ఆలయంలో కుంబాభిషేకం, కోటి కుంకుమార్చన పేరుతో రూ.కోట్లు భోజంచేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అలాగే దాతలు ఇచ్చిన విరాళాల లెక్కలు గల్లంతు అయ్యాయనే ఫిర్యాదుల అందడంతో ఇటీవల దేవదాయ శాఖ ఉన్నతాధికారులు మూడు రోజులపాటు విచారించారు. సుమారు 3 కోట్ల రూపాయల మేర అవినీతి జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ అవినీతిలోనూ ముఖ్య పాత్రధారులు వైసీపీ ప్రాపకంతో పాలకమండలి పదవులు వెలగబెట్టిన వారేననే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కాలంలో పనిచేసిన ఈఓలు తాము ఆలయ పరిరక్షకులమనే విషయాన్నే మరిచిపోయి అధికార పార్టీ నాయకులకు సాగిలపడ్డారు. అవినీతి సొమ్ములో అంతో ఇంతకో ఆశపడిన నేరానికి వీరిపై వేటు పడింది. అవినీతి, అక్రమాలు జరిగాయనే అభియోగాలపై ఆలయ పూర్వ ఈఓ, ప్రస్తుతం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ ఈవోగా ఉన్న డబ్బుగుంట వెంకటేశ్వర్లు, కొంతకాలం ఇన్‌చార్జి ఈఓగా, ప్రస్తుతం వేదగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈఓగా పనిచేస్తున్న గిరికృష్ణలను దేవదాయ శాఖ సస్పెండ్ చేసింది.
- వింజమూరు మండలం నల్లగొండ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ బొగ్గల మల్లికార్జున్ రెడ్డి ఆలయ నిర్వహణలో నిబంధనలు అతిక్రమించారని, దేవాలయ ఆస్తుల వేలం పాటలో వైసీపీ నేతల ఆదేశాలను పాటించి తక్కువ ధరకు ధారాదత్తం చేశారనే అభియోగాలు వచ్చాయి. ఈ కారణలతో మల్లికార్జునపైనా వేటు పడింది


'మినగల్లు' యార్డులో

ఇసుక దొంగలు!

- 12 వేల టన్నులకు తేలని లెక్క
- 41 వేల టన్నులకు అమ్మింది 29 వేల టన్నులే
- రూ.45 లక్షల విలువైన ప్రజాధనం స్వాహా
- దొంగ బిల్లులతో తరలిస్తున్నట్లు ఆరోపణలు

నెల్లూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు ఇసుక యార్డులో దొంగలు పడ్డారు. యార్డులో దొంగలు పడటం ఏమిటనుకుంటున్నారా..? ఇది నిజం. యార్డులో 12 వేల టన్నుల ఇసుక మాయమైంది. విక్రయాలకు ముందు అధికారులు వేసిన కొలతలకు.. విక్రయాలు పూర్తయ్యాక వచ్చిన లెక్కలకు పొంతన కుదరడం లేదు. ఈ నెల 8వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభించింది. రీచ్‌లలో తవ్వకాలకు పర్యావరణ అనుమతులు వచ్చే వరకూ యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకను ప్రజలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని మర్రిపాడు, మినగల్లు, పల్లిపాడు యార్డులలో మాత్రమే ఇసుక నిల్వలు ఉన్నాయి. మైనింగ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా డీజీపీఎస్ సర్వే చేసి మర్రిపాడులో 1.25 లక్షల టన్నులు, మినగల్లులో 41 వేల టన్నులు, పల్లిపాడులో 8 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని నిర్ధారించారు. ఇది డిజిటల్ సర్వే కావడంతో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఉండదు. దీంతో ఆ యార్డుల్లో సీనరైజ్, రవాణా వంటి ఖర్చులను కలుపుకొని టన్ను రూ.370 చొప్పున విక్రయించారు. వీఆర్వోలు, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ల ఆధ్వర్యం లో విక్రయాలు జరిగాయి. లోడింగ్, నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు ఏజన్సీకు అప్పగించారు. మినగల్లులో ఐదు రోజుల క్రితం ఇసుక నిల్వలు అయిపోవడంతో విక్రయాలు నిలిచిపోయాయి. మొత్తంగా విక్రయించిన ఇసుక లెక్కలు తీస్తే 29 వేల టన్నులు మాత్రమే అమ్మినట్లు తేలింది. మరి ప్రారంభంలో 41 వేల టన్నుల ఇసుక ఉండగా చివరకు 29 వేల టన్నులే తేలడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఖచ్చితంగా కొలతలు వేసి లోడింగ్ చేయడం లేదు కాబట్టి ఒకవేళ తేడా వస్తే ఐదు వందలో లేదా వెయ్యి టన్నులో తేడా రావాలి గానీ, ఏకంగా 12 వేల టన్నుల తేడా రావడం చర్చనీయాంశంగా మారింది.

• కొరతను పూడ్చేయత్నం



టన్ను రూ.370 లెక్కన దాదాపు రూ.45 లక్షల విలువైన ప్రజాధనం స్వాహా జరిగినట్లు అర్థమవుతోంది. యార్డులో తగ్గిన 12 వేల టన్నుల ఇసుకను మినగల్లు నుంచి తవ్వి డంప్ చేసేందుకు ఏజెన్సీ ప్రతినిధులు ప్రయత్నించగా వారిని అధికారులు అడ్డుకున్నట్లు తెలిసింది. లోడింగ్‌కు అనుమతులు ఇచ్చింది యార్డులో మాత్రమేనని, నదిలో నుంచి కాదని వారించడంతో ఏజెన్సీ వెనక్కు తగ్గినట్లు సమాచారం. ఇంత భారీ స్థాయిలో ఇసుక తేడా వచ్చినా అధికారులు మౌనంగా ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

• పల్లిపాడులో ఎక్కువ

మినగల్లు యార్డులో ఇసుక విక్రయాలపై మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలుదారులకు, యార్డు నిర్వాహక ఏజెన్సీ ప్రతినిధులకు మధ్య పలుమార్లు వివాదాలు కూడా జరిగాయి. క్యూలో ఉన్న తమకు కాదని, దొంగ బిల్లులతో కొందరికి ఇసుకను వేగంగా లోడ్ చేస్తున్నారని వాహనదారులు ఆరోపణలు చేశారు. ఇందులో నిర్వాహక ఏజెన్సీ, రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కయ్యారని ప్రచారం జరిగింది. ఆ ప్రచారానికి బలం చేకూర్చేలా ఇప్పుడు ఇసుక నిల్వల్లో తేడా వచ్చింది. మినగల్లులో ఉన్న ఏజెన్సీనే పల్లిపాడు యార్డులో కూడా చేసింది. అక్కడ మాత్రం అధికారులు వేసిన కొలతల కన్నా 40 టన్నుల ఎక్కువగా విక్రయాలు జరిగాయి. ఈ వ్యవహారంపై బుచ్చి ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆనంద్‌ను వివరణ కోరగా మినగల్లు యార్డులో 12 వేల టన్నుల ఇసుక తేడా వచ్చింది వాస్తవమేనని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని పేర్కొన్నారు. కాగా కలెక్టర్ ఓ ఆనంద్‌ను వివరణ కోరగా ఈ వ్యవహారంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

నెల్లూరు కమిషనర్ సంతకం

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్ట్ ?

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూలై 30 : నెల్లూరు నగర పాలక సంస్థకు ఇటీవల వరకు కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్ సంతకం ఫోర్జరీ చేసిన కేసులో నగర మేయర్ భర్త జయవర్ధన్ ప్రధాన అనుచరుడు శివకృష్ణను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది. దీనిపై దర్గామిట్ట స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా ఏమో అరెస్ట్ చేశారా?, జైలుకు పంపారంటగా? అంటూ సమాధానం ఇచ్చారు. తన సంతకాలను ఫోర్జరీ చేశారంటూ గత కమిషనర్ వికాస్ దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేయర్ భర్త జయవర్ధన్‌తో పాటు, శివకృష్ణ, మరో నలుగురిని నిందితులుగా చేరుస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నిందితులను అదుపులోకి తీసుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. పరారీలో ఉన్న శివకృష్ణను సాంకేతికత ఆధారంగా మంగళవారం అరెస్ట్ చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

మాదక ద్రవ్యాల కట్టడికి

చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

నెల్లూరు(క్రైం), జూలై 30: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల కట్టడికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్పీ జీ కృష్ణకాంత్ పోలీసు కార్యాలయం నుంచి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. కలెక్టర్ తన కార్యాలయం నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. యువత మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. భావితరాలపై మాదకద్రవ్యాల ప్రభావం పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హాస్టల్స్‌లో తనిఖీలు నిర్వహించాలని, మాదక ద్రవ్యాలకు బానిసైన యువతకు డీఅడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించి వారిలో పరివర్తన తీసుకువచ్చేలా చొరవ చూపాలన్నారు. ఆర్టీసీ, రైల్వే రవాణా వ్యవస్థ, చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఎస్పీ కృష్ణకాంత్ మాటాడుతూ మాదక ద్రవ్యాలు, నిషేధిత మత్తుపదార్థాల అమ్మకం, నిల్వ, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్ఈబీ ఈఎస్ బాబుశ్రీధర్, జిల్లా వైద్య అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతా,శిశు ఆరోగ్యానికి

'కిల్కారి'ని సద్వినియోగం చేసుకోవాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), జూలై 30 : మాతా, శిశు ఆరోగ్యానికి సంబంధించి కిల్కారి మొబైల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సూచించారు. మంగళవారం ఆశా నోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమీ సేవలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు ఆరోగ్య భద్రత, గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. వారి ఆరోగ్య నియమాలు, తీసు కోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అప్ర మత్తం చేసేందుకు కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ అందించేందుకు ప్రభుత్వం దీనికి రూపకల్పన చేసిందని వివరించారు. గర్భం దాల్చిన తర్వాత ఏఎన్ఎంల దగ్గర వివరాలు నమోదు చేయించుకుంటే ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయని చెప్పారు. గర్భందాల్చి నప్పటి నుంచి కాన్పు తర్వాత బిడ్డకు ఏడాది వయసు వచ్చేంత వరకు 72 సార్లు ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ టీం కన్సల్టెంట్ రవీంద్ర, రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ లంక పల్లి రాజు, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, ప్రోగ్రాం అధికారి కీర్తి, డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కనకరత్నం, రమేష్, మంజుల, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఒకటినే వందశాతం

- పెన్షన్ల పంపిణీకి రంగం సిద్ధం
- 7 వేల మంది ప్రభుత్వ సిబ్బందితో పంపిణీ
- జిల్లాలో 3,13,784 మంది పెన్షనుదారులు



నెల్లూరు (హరనాథపురం); జూలై 30 : ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆగస్టు 1వ తేదీన వందకు వంద శాతం పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లాయంత్రాంగం కూడా విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఎన్డీయే ప్రభు త్వం అధికార చేపట్టిన మొదటి జూలై 1న జిల్లాలో 99 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసి అధికారులు రికార్డు సృష్టించారు. వలంటీర్లు లేకపోయినా సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లను పంపిణీ చేయించారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఆగస్టు 1వ తేదీనే జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులందరికీ పెన్షన్ సొమ్ము నూటికి నూరుశాతం అందించడానికి చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఆనంద్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మండల, మున్సిపల్ అధికారులతో పెన్షన్ల పంపిణీపై సమీక్షించి, పలు సూచనలు చేశారు.

• నేడు బ్యాంకుల నుంచి నగదు

జిల్లాలో పెన్షన్ల పంపిణీకి సంబంధించి బుధవారం నాడే (31న) బ్యాంకుల నుంచి సచివాలయ సిబ్బంది (జిల్లావ్యాప్తంగా 7వేలమంది) నగదు తెచ్చుకొని పంపిణీకి సిద్ధం కానున్నారు. గురువారం తెల్లవారు జాము 5.30 గంటల నుంచే పెన్షన్ పంపిణీ జిల్లాలో ప్రారంభం కానుంది. కాగా, జిల్లాలో సామాజిక పెన్షన్ల లబ్ధిదారులు 3,13,784 మంది ఉండగా, వీరికి ప్రతి నెలా రూ.132.58 కోట్లు పెన్షన్ రూపంలో అందిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

ఆగస్టు 1న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను నూటికి నూరు శాతం పంపిణీ చేయించడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఉదయాన్నే ప్రభుత్వ సిబ్బంది పెన్షనర్ల ఇళ్లకు వెళ్లి పింఛను నగదు పంపిణీ చేస్తారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్దనే ఉండి పెన్షన్ అందుకోవాలి.


- సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

వైసీపీ ఐదేళ్ల పాలనలో నత్తనడకన సాగిన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు మళ్లీ ఊపందుకోనున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో ఈ లైన్‌కు రూ.150 కోట్లు ప్రకటించగా, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా అదనంగా ఇవ్వనుంది. ఇప్పటికే దర్శి, పొదిలి ప్రాం తాల్లో పనులు పూర్తి కావస్తుండగా కనిగిరి, పామూ రు ప్రాంతాల్లో పనులు పునఃప్రారంభ మయ్యాయి. ఏడాదిలోపు అక్కడ పనులు పూర్తయి నెల్లూరు జిల్లాలో పనులు ప్రారంభించనున్నారు. దీంతో మెట్ట వాసులకు రైలులో ప్రయాణ భాగ్యం అందుబాటులోకి రానుంది.

- కేంద్ర బడ్జెట్‌లో రూ.150 కోట్ల కేటాయింపు
- నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులు వేగవంతం
- ఇప్పటికే జిల్లా పరిధిలో 2,268 ఎకరాల సేకరణ

'మెట్ట'లో రైలు కూత!

ఉదయగిరి రూరల్, జూలై 30 : గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల మీదుగా 38 స్టేషన్లతో 309 కిలోమీటర్ల పొడవున నడికుడి శ్రీకాళహస్తి రైల్వేలైన్ ఏర్పాటు కానుంది. మెట్ట ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ అభివృద్ధి చెందడంతో పాటు హైదరాబాదు, విజయవాడ వంటి నగరాలకు దూరం తగ్గనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సం యుక్తంగా ఈ నిర్మాణాన్ని చేపట్టనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సగం వ్యయం సమకూర్చడంతోపాటు భూసేకరణ ఖర్చును భరించాల్సి ఉంది. 2011-12 బడ్జెట్‌లో రూ.2,289 కోట్లతో కేంద్రం ఈ ప్రాజెక్టు కు శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2016 వరకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. గతేడాది రూ.202 కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో రూ.150 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా తన వాటా కేటాయించనుంది. తొలుత గుంటూరు జిల్లా పిడుగురాళ్ల నుంచి పనులు ప్రారంభమయ్యాయి. దర్శి, పొదిలి ప్రాంతాల్లో పనులు దాదాపుగా పూర్తి కాగా ట్రయల్ రన్ కూడా నిర్వహిం చారు. కనిగిరి, పామూరు ప్రాంతాల్లో పనులు పునఃప్రారంభమయ్యాయి. మరో ఏడాదిలో నెల్లూరు జిల్లాలో పనులు ప్రారంభించనున్నారు. వరికుంటపాడు, వింజమూరు, ఆత్మకూరు, రాపూరు, వెంకటగిరి మండలాల మీదుగా 15 స్టేషన్లతో రైల్వే మార్గం పనులు సాగనున్నాయి. ఈ లైన్ నిర్మాణానికి 5,189 ఎకరాల భూమి అవసరం. 2019లోనే గ్రామ సభలు నిర్వహించి సుమారు 2,268 ఎకరాలను అధికారులు సేకరించారు. ఇందుకు సంబంధించి పలువురికి వారి ఖాతాల్లో పరిహారం సైతం జమైనట్లు సమాచారం.



• ప్రయోజనాలెన్నో..

రాష్ట్రాభివృద్ధితోపాటు జాతీయ రవాణాలో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైను కీలకంగా మారుతుందని పలు సర్వేల్లో తేలింది. తిరుపతి, హైదరాబాదు మధ్య 80 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతులకు ఈ లైన్ ఊతంగా నిలుస్తుంది. సిమెంట్, గ్రానైట్ ఉత్పత్తుల రవాణాకు వీలు కలుగుతుంది. తుఫాన్లు, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో ఈ రైల్వేలైన్ ప్రత్యామ్నాయంగా దోహదపడుతుంది. ఈ మార్గం అందు బాటులోకి వస్తే గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యే అవకాశం ఉంది.


రైల్వేలైన్ కోసం రాపూరు ప్రాంతంలో సేకరించిన భూమి (ఫైల్)

ఉప్పు రైతును ముంచిన అకాల వర్షం

● ఇటుక బట్టీలపైనా తీవ్ర ప్రభావం

అల్లూరు, జూలై 30 : అకాల వర్షం రైతుల పాలిట శాపంగా మారింది. రైతులు కష్టపడి చేపట్టిన ఉప్పు, ఇటుకల తయారీ చేతికందే నాటికి వర్షాలతో తీవ్ర నష్టాలభారీన పడుతున్నారు. ఈ ఏడాది వర్షాల కారణంగా జిల్లాలో నెలకు 10 వేల మెట్రిక్ టన్నుల ఉప్పు ఉత్పత్తి అయ్యే అవకాశాన్ని రైతులు కోల్పోయారు.

ఉప్పు రైతుల ఆశలపై నీళ్లు

గత రెండేళ్లుగా ఉప్పుకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయని భావించిన ఉప్పు రైతులు ఈ ఏడాది కూడా ఆశాజనకంగా ఉప్పు ఉత్పత్తి చేపట్టారు. ముమ్మరంగా ఉప్పు ఉత్పత్తి అవుతున్న సమయంలో ఈ వర్షం తీరని నష్టాన్ని మిగిల్చి వారి ఆశలపై నీరు చల్లింది. జనవరి మాసం నుంచి ఉప్పు కయ్యలను సిద్ధం చేసుకొని మార్చి నెల నుంచి ఉత్పత్తి అధికంగా ఉంటుందని భావించిన ఉప్పు రైతులకు ఈ వర్షం మూలుగుతున్న నక్కపై తాటికాయ పడిన చందాన మారింది. ఉప్పు క్వింటా ధర రూ.300 వరకు పలుకుతుండడంతో గిట్టుబాటు ధర ఉందని భావించిన రైతులకు కష్టపడి ఉత్పత్తి చేసిన ఉప్పు కళ్లెదుటే కయ్యల్లోనే కరిగిపోయి రైతుల ఆశలను సైతం కరిగించేసింది.



నీటిలో కరిగిపోయిన ఉప్పు

ఉప్పు, ఇటుకకు భారీ గిరాకీ


జిల్లాలో ఉత్పత్తి అయ్యే ఉప్పు, తయారు చేసే ఇటుకలకు నాణ్యతను బట్టి బయటి జిల్లాలు, రాష్ట్రాల్లో భారీ గిరాకీ ఉంటుంది. ఈ క్రమంలో ఈ అకాల వర్షాలు రైతులకు ఈ రెండు రంగాల వారిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. తీరప్రాంతంలోని ఉప్పు తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, బీహార్, గుజరాత్, కర్నాటక రాష్ట్రాలకు తరలి వెళ్లడంతో ఇక్కడి ఉప్పుకు ఏమాత్రం గిరాకీ ఉంటుందో అర్థమవుతోంది. అదేవిధంగా ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోని అత్యధికంగా తీరప్రాంత భూముల్లో తయారు చేసే ఇటుకకు భారీ గిరాకీ ఏర్పడింది.



వర్షానికి పచ్చి ఇటుకలకు కప్పిన పట్టలు

ఇటుక బట్టీలకు భారీ నష్టం

ప్రతిఏటా వేసవిలో ఇటుక తయారీ జరుగుతోంది. ఈ క్రమంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు ఇటుక బట్టీల యజమానులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. అకాల వర్షం అంటే ఒక గంటో రెండు గంటలో కురుస్తుందని భావించిన నేపథ్యంలో రెండు రోజులుగా పదును వర్షం కురవడంతో బట్టీల తయారీ కేంద్రాల్లో నీరు పారడంతో తయారు చేసిన పచ్చి ఇటుక కరిగిపోయింది. ఇప్పటికే కూలీల ధరలు అధికమై అధిక వ్యయంతో ఇటుకను తయారీ చేపట్టిన నేపథ్యంలో ఈ వర్షం వారిని నష్టాల ఊబిలోకి నెట్టింది.



ఆశ నిరాశ అయింది

ఈ ఏడాది ఉప్పు ఉత్పత్తి చేపట్టి అప్పులు తీర్చుకుందామనుకునేసరికి అకాల వర్షం నష్టాన్ని మిగిల్చింది. అప్పుల ఊబిలో నుంచి ఇప్పుడిప్పుడే బయట పడుతున్న క్రమంలో ఈ వర్షం మళ్లీ అప్పుల్లోకి నెట్టేలా ఉంది. ఉత్పత్తి చేసుకున్న ఉప్పు మళ్లీ నీటిలో కరిగిపోయి ఆశలపై నీళ్లు చల్లింది.

- రామలింగం చంద్రశేఖర్, ఉప్పు రైతు, తూర్పు గోగులపల్లి

అకాల వర్షంతో తీవ్ర నష్టం

వేసవి సమయాల్లోనే ఇటుక తయారీకి అనుకూల వాతావరణం. ప్రతిఏటా చేపట్టే ఇటుక తయారీ ఈ ఏడాది కూడా ప్రారంభించాం. అసలే కూలీలు దొరక్క అధిక నగదు చెల్లించి పనుల్లో పెట్టుకొని ఇటుక తయారీ చేపడిన కొద్ది రోజులకే ఈ అకాల వర్షం పెను నష్టాలను చవిచూపిస్తున్నాయి.



- నిమ్మల భాస్కర్, ఇటుక తయారీ యజమాని, అల్లూరు

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం : కావలి వాసి మృతి

కావలి రూరల్, జూలై 30: కర్నాటక రాష్ట్రం కోలార్ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కావలి మండలం ఆముదాలదిన్నె పంచాయతీ కొనదిన్నెకు చెందిన ఉప్పాల శివకోటయ్య(34) అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితుల సమాచారం మేరకు.. కావలి పట్టణం పుల్లారెడ్డినగర్‌కు చెందిన చిలకా చంద్రమౌళి (అలియాస్ చిట్టి) తన కుమార్తె నిఖిత, తన బంధువు ఉప్పాల శ్రీను కుమారుడిని బెంగళూరులో ఇంజనీరింగ్‌లో చేర్పించాలనుకున్నారు. ఈ మేరకు వారిని కళాశాలలో చేర్పించేందుకు చంద్రమౌళి తన కారుకు డ్రైవర్‌గా కొనదిన్నెకు చెందిన శివకోటయ్యను తీసుకుని గుమ్మడిబండలకు చెందిన తన స్నేహితుడు జయరామయ్యతో కలసి సోమవారం రాత్రి బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం తెల్లవారుజామున కోలార్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పల్టీ కొట్టగా వెనుక వస్తున్న ట్రావెల్స్ బస్ ఆ కారును ఢీకొంది. దీంతో డ్రైవర్ శివకోటయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా కారులో ముందుసీట్లో కూర్చుని ఉన్న చంద్రమౌళి తీవ్రంగా గాయపడ్డాడు. వెనుక సీట్లో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతుడికి భార్య సౌజన్య, ఒక కుమార్తె ఉన్నారు.

మూడిళ్లు, రెండు గుళ్లలో చోరీలు

● మనుబోలులో రెచ్చిపోయిన దొంగలు


మనుబోలు, జూలై 30: తాళాలు వేసిన ఇళ్లు.. గుళ్లను లక్ష్యంగా చేసుకుని మనుబోలులో సోమవారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. స్థానిక కోదండరామపురంలోని రెండు గుళ్ళు, మూడిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడి అందినకాడికి దోచుకెళ్లారు. మంగళవారం వేకువకల్లా చోరీల సంగతి తెలియడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. పోలేరమ్మ గుడిలో తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి హుండీని ధ్వంసంచేసి అందులోని నగదు, అమ్మవారి ముక్కుపుడక, మంగళసూత్రాలు తస్కరించారు. అలాగే కోదండరామాలయంలో చోరీకి యత్నించారు. రామాలయం ఎదురుగా తాళం వేసి ఉన్న సర్వం భట్ల వెంకట శేషయ్య ఇంట్లో, రామాలయానికి పక్కనే తాళం వేసి ఉన్న జాలారి రాధయ్య ఇంట్లో తలుపులు ధ్వంసం చేసి చోరీలకు పాల్పడ్డారు. అలాగే మరోవీధిలో నిర్మలమ్మ ఇంటికి తాళం వేసి ఉండగా అక్కడా దొంగతనానికి పాల్పడ్డారు. ఆ ఇంట్లో రెండు జతల బంగారు కమ్మలు అపహరించుకుపోయారని బాధితులు తెలిపారు. చోరీల విషయం తెలుసుకున్న ఎస్ఐ అజయ్‌కుమార్ గుళ్ళు, ఇళ్లను పరిశీలించారు. క్లూస్‌టీమ్ వేలిముద్రలు సేకరించి, కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చిందరవందరగా పడిఉన్న బీరువాలోని వస్తువులు

లారీడ్రైవర్ మృతి

మనుబోలు, జూలై 30: మండల పరిధిలోని కాగితాలపూరు క్రాస్ రోడ్డు సమీపంలో లారీ డ్రైవర్ జీ మోహన్ (58) మంగళవారం వేకువన అనారోగ్యంతో మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రంలోని కుంభకోణం పరిధిలోని మీన్‌చూరిటి గ్రామానికి చెందిన మోహన్ 28ఏళ్ళుగా గుమ్మడిపూండిలోని భారత్‌గ్యాస్ కంపెనీలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సిలిండర్ లోడుతీసుకుని నెల్లూరుకు వచ్చి దించాడు. తిరుగు ప్రయాణంలో సోమవారం అర్ధరాత్రి వెళుతుండగా అనారోగ్యానికి గురికావడంతో కాగితాలపూరు క్రాస్ రోడ్డు సమీపాన లారీ నిలిపివేశాడు. మంగళవారం వేకువవరకు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ చనిపోయాడని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్యాస్ కంపెనీ సహచర లారీడ్రైవర్‌లు మోహన్ మృతదేహం వద్దకు చేరుకుని బోరున విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తమిళనాడు నుంచి వచ్చిన బంధువులకు లారీడ్రైవర్ మృతదేహాన్ని పోలీసులు అప్పగించారు.



లారీడ్రైవర్ మృతదేహం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6509
వెండి కిలో ధర	రూ. 84,000
వెండి ఒక గ్రాము	రూ. 86.00

రుణ బకాయిలు చెల్లిస్తేనే రుణాలు

వరికుంటపాడు, జూలై 30: స్త్రీనిధి రుణాలు తీసుకున్న లబ్ధిదారులు బకాయిలు చెల్లి స్తేనే నూతన రుణాలు మంజూరు చేస్తామని స్త్రీనిధి జిల్లా ఏజీఎం కామాక్షయ్య తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో రూ.20లక్షల బకాయిలు ఉన్నాయన్నారు. వీవోఏలు బాధ్యతగా వ్యవహరించి ఆగస్టులో పూర్తిగా చెల్లింపులు చేయించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ రుణాలను కేవలం రెండు రోజుల్లోనే మంజూరు చేసి సభ్యులకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. గువ్వాడి, కాంచెరువు, నల్లబోతులవారిపల్లి, నార్త్‌కొండాయపాళెం, తోటలచెరు వుపల్లి, వరికుంట పాడు గ్రామాల్లోని బకాయిదారులకు నోటీసులు అంజేయాలని ఏపీఎం వైనారూత్‌కు సూచించారు. తిమ్మారెడ్డిపల్లి క్లస్టర్‌లో మాత్రమే చెల్లింపులు మెరుగ్గా ఉండడంతో రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజరు మౌనిక, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ


సంగం : జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లకు వాణిజ్య బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తున్నట్లు బుచ్చి సహకార బ్యాంకు మేనేజర్ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సహకార బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమాదేవి, ప్రభాకర్, దస్తగిరి పాల్గొన్నారు.

సిటీ ప్లానింగ్‌లో అవినీతి తిమింగలం

నెల్లూరు నగర పాలక సంస్థలో సిటీ ప్లానింగ్ విభాగం అంటేనే అవినీతి కంపు.. ఆ విభాగంపై పెత్తనం చెలాయిస్తున్న అధికారి అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఒకటిన్న ఏడాది క్రితం వైసీపీ ప్రభుత్వంలో నెల్లూరు కార్పొరేషన్‌కు వచ్చిన ఆ అధికారి అవినీతి దాహానికి అంతులేకుండాపోతోంది. గత కమిషనర్ వికాస్ మర్మత్ వద్ద అన్నీ తానై వ్యవహరించిన సదరు అధికారి ఓసీ (ఆక్యుపేషన్ సర్టిఫికెట్), మార్టుగేజ్ (తనఖా)లకు భారీ ప్యాకేజీలు వసూలు చేస్తు న్నారన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. గత కమి షనర్ సంతకాల ఫోర్జరీలోనూ ఆ అధికారికి పరోక్ష ప్రమే యం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

- ఓసీ, మార్టుగేజీలకు భారీ వసూళ్లు
- గట్టుచప్పుడు కాకుండా సొమ్ము స్వాహా
- ఫోర్జరీ స్కాంలోనూ హస్తం?
- ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న అధికారి బాగోతాలు

నెల్లూరు(సిటీ), జూలై 30 : నెల్లూరులోని ఇస్కాన్ సిటీలో వైసీపీకి చెందిన ఓ సహకార సంస్థకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి నిర్మించిన అపార్టుమెంట్‌లో 25 శాతానికి పైగా నిబంధనలు అతిక్రమించారు (డీవియేషన్) అనే ఆరోపణలున్నాయి. అయినా ఆ నిర్మాణానికి సిటీ ప్లానింగ్ అధికారి ఓసీ మంజూరు చేశారు. అంతే కాదు మార్టుగేజీ కూడా విడుదల చేసేందుకు భారీ ప్యాకేజీ తీసుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంతలో టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ ఫైల్‌ను రహస్యంగా ఉంచేశారని సమాచారం. ఇదేవిధంగా మాగుంట లేఅవుట్‌లోని మరో అపార్టుమెంట్‌లో 30 శాతం డీవియేషన్ ఉంది. దాని యజమానితో కూడా సిటీ ప్లానింగ్ అధికారి ఒప్పందం చేసుకుని భారీ ప్యాకేజీతో ఓసీ విడుదల చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. డీవియేషన్ 10 శాతం లోపు ఉంటేనే జరిమానా విధించి ఓసీ, మార్టుగేజీలు మంజూరు చేసే అధికారం నగర పాలక సంస్థకు ఉంది. అంతకుమించి డీవియేషన్ ఉంటే బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజ్‌డ్ సిస్టమ్)లో దరఖాస్తు చేసుకుని జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ అవకాశం ప్రస్తుతం అమలులో లేదు. ఇదే అదునుగా సదరు అధికారి డీవియేషన్ పేరుతో బెదిరించి ఆపై భారీ ప్యాకేజీలు వసూలు చేస్తున్నారు. ఈ విధంగా గడి చిన ఏడాది కాలంలో రూ. కోట్లు కూటబెట్టినట్లు చర్చ జరుగుతోంది.



ఫోర్జరీ స్కాంలోనూ పరోక్ష ప్రమేయం...?

నగర పాలకసంస్థ పూర్వ కమిష నర్ వికాస్ మర్మత్ సంతకాల ఫోర్జరీ కుంభకోణంలోనూ సిటీ ప్లానింగ్ అధికారి పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లైసెన్సుడ్ ఇంజనీర్ లాగిన్ నుంచి ఫోర్జరీ ఫైల్స్ టీపీఎస్‌లకు రాగా, వాటిని తుది దశలో ఆమోదించాల్సినది ఈ అధికారే. ఆ తరువాతే కమిషనర్ లాగిన్‌కు వెళ్తుంది. కానీ డీవియేషన్ అత్యధికంగా ఉండటం, సంతకాలు తేడా అని తెలిసి ఈ అధికారి ఎలా ఆమోదించారన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ కోణంలోనూ పోలీసు, విజిలెన్స్ విచారణ జరుగుతుండటం గమనార్హం. ఇన్ని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ అధికారి ఏడాదిన్న క్రితం నెల్లూరు కార్పొరేషన్‌కు రాగా ఇప్పటి వరకు ఒక్క కోర్టు కేసును కూడా పరిష్కరించలేదన్న ఆరోపణలున్నాయి. పైగా అన్నీ సక్రమంగా ఉన్న ఫైల్స్‌ను కూడా కొర్రీలు పెట్టి వెనక్కు పంపడంలో దిట్టగా పేరుపొందారు. ఈ అవినీతి తిమింగలం వ్యవహారంపై విచారణ జరిపితే మరిన్ని బాగోతాలు బహిర్గతమ వుతాయనే డిమాండ్ వినిపిస్తోంది.

అగ్రహారంలో నకిలీ ఇళ్ల పట్టాలు

● తహసీల్దారు సంతకం ఫోర్జరీ

అనంతసాగరం, జూలై 30: మండలంలోని బొమ్మవరం పంచాయతీలోని అగ్రహారంలో రెండు నకిలీ నివేశ స్థల ఆధీన ధ్రువీకరణ పత్రాలు బుధవారం వెలుగు చూడడంతో స్థానికులు అవాక్కయ్యరు. గత ప్రభుత్వంలో గ్రామ కంఠం సర్వే నెంబరు 403లో జగనన్న కాలనీలో లేఅవుట్లు వేశారు. అయితే గతంలో కొందరు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి ఇంటి స్థలం మంజూరు కాలేదు. అలాంటి వారు నేడు ఆ లేవుట్లలో ఇంటి నిర్మాణాలు చేస్తుండగా అనుమానం కలిగి స్థానిక టీడీపీ నాయకులు గూడూరు శ్రీకాంత్‌రెడ్డి వీఆర్‌వోకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారి వద్ద ఉన్నా ఇళ్ల నివేశ స్థలపత్రాలు పరిశీలించగా అందులో స్టాంప్‌లో రాజముద్ర లేకపోవడం, పట్టాలో పొందు పరిచిన రిజిష్టరు నెంబరు కలిగిన ఫైల్ కార్యాలయంలో లేకపోవడం, విస్తీర్ణం, లబ్ధిదారుని పూర్తి వివరాలు పొందుపరచకపోవడంతో పాటు ఇటీవల అనంతసాగరం నుంచి బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళ్లిన పూర్వపు తహసీల్దారు సంతకం కూడా ఫోర్జరీ చేసిన విధంగా ఉండడం అనుమానాలకు తావిచ్చింది. ఈ విషయంపై వారు ప్రస్తుత ఇన్‌చార్జి తహసీల్దారు గిరీష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బదిలీపై వెళ్లిన పూర్వపు తహసీల్దారు నరసింహరావును అగ్రహారంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారా? అని వాట్సప్ ద్వారా ఫిర్యాదు దారుడు ఇచ్చిన పట్టాల ప్రతిని పంపారు. దీనిపై లిఖిత పూర్వక వివరణ కోరాడు. అందుకు ఆయన స్పందిస్తూ గూడ సులోచన, కాసా ఈశ్వరమ్మ పేరుతో తాను నివేశ స్థలపత్రాలు ఇవ్వలేదని అందులో ఉన్నది తన సంతకం కాదని వివరణ ఇచ్చారు. దీంతో అవి నకిలీ ఇళ్ల పట్టాలుగా తేలిపోయాయి. దీనిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు సాగరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



నకిలీ ఇంటి పట్టా

పాత్ర, సూత్రదారులు ఎవరూ ?

నకిలీ ఇళ్ల పట్టాల సృష్టించడంలో పాత్ర, సూత్రదారులు ఎవరనే విషయం చర్చినీయాంశంగా ఉంది. కార్యాలయంలో పనిచేసే ఒకరిద్దరి హస్తం ఉంటుందని అనుమానం వ్యక్తమతోంది. లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మను బాకర్‌కు అభినందనలు..

అనంతసాగరం, జూలై 30: చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. ఒలంపిక్స్‌లో అథ్లెట్ విభాగంలో మను బాకర్ కాంస్య పతకం సాధించ డంతో మను పేరుతో చేపట్టిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు మహేష్, వెంకటేశ్వర్లు, రమణరాజు, మదినా, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మను పేరుతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఇంటికి రూ.4లక్షలు చంద్రబాబు ఘనత

జగన్ మానసికస్థితిపై అనుమానం ● టీడీపీ నేత కోటంరెడ్డి



విలేకరుల సమవేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(వైద్యం), జూలై 30 : పేదల ఇంటి నిర్మాణానికి ఇచ్చే నిధులను రూ.4 లక్షలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో ఇంటి నిర్మాణానికి నాటి సీఎం జగన్ రూ. 1.80 లక్షలు ఇస్తే దానిని చంద్రబాబు రూ.4 లక్షలకు పెంచారని ఆనందం వ్యక్తం చేశారు. జగన్ పట్టణాల్లో చాలీచాలని ఆరు అంకణాలు, పల్లెల్లో 9 అంకణాలు చొప్పున ఇచ్చారని, దానిని ప్రస్తుత ప్రభుత్వం రెట్టింపు చేసిందని తెలిపారు. జర్నలిస్టులకు సైతం అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోనే ఇళ్లు నిర్మించి అతి తక్కువ ధరకు ఇచ్చే విధంగా రూపకల్పన చేశారన్నారు. సొంత కుటుంబ సభ్యులే జగన్ను నమ్మడం లేదని విమర్శించారు. జగన్ మానసిక పరిస్థితి ఆందోళన కరంగా ఉందని ఆయన్ను మెంటల్ ఆసుపత్రిలో చేర్పించాలని ఎద్దేవా చేశారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, కువ్వారపు బాలాజీ, అంచూరు శ్రీనివాసులు నాయుడు, మొహిద్దీన్, పెంచల చౌదరి, నాగేంద్ర పాల్గొన్నారు.

భర్త వేధింపులతో వివాహిత మృతి : గోనుపల్లిలో విషాదం

రాపూరు(డక్కిలి), జూలై 30 : గోనుపల్లి దళితవాడకు చెందిన పల్లి కవిత (27) మంగళవారం చీరతో ఫ్యానుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. విషయం తెలుసుకొన్న కుటుంబ సభ్యులు కవితను ఆసుపత్రికి తరలించేలోపే ఆమె మరణించినట్లు వారు తెలిపారు. భర్త వేధింపులు తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు మృతిరాలి కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన మరిన్ని వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కొండూరురెడ్డిపల్లి గ్రామానికి చెందిన బల్లి చంద్రతో కవితకు తొమ్మిదేళ్ల కిందట వివాహం జరిగింది. ఆర్థిక ఇబ్బందులతో కవిత రెండన్నర ఏళ్ల క్రితం గల్ఫ్‌దేశంకు పనికి వెళ్లింది. అక్కడ సంపాదించిన డబ్బును భర్తకు పంపేది. ఈ నెల 12వ తేదీన గల్ఫ్ నుంచి తిరిగి దేశానికి వచ్చి నేరుగా పుట్టినింటికి వెళ్లింది. డబ్బులు పంపాలని భర్త చంద్ర, అత్త పుల్లమ్మలు వేధింపులతోనే మరణించిందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు గోనుపల్లికి చేరుకొని కమిత మృతదేహన్ని రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో రాపూరు ఎస్ఐ మాలాద్రి కవిత భర్త చంద్రను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కవితకు కుమారుడు వున్నాడు.

సోమశిలలో 9.521 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 30: సోమశిల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారానికి 9.521 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

విష గుళికలు తిని ఇద్దరి దుర్మరణం

వెంకటాచలం, జూలై 30 : మండలంలోని ఈదగాలి, చవటపాళెం గ్రామాల్లో మంగళవారం విష గుళికలు తిని ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని ఈదగాలికి చెందిన కొల్లు వెంకటరమణయ్య (51), చవటపాళెంకి చెందిన నాగేశ్వరి (22) ఇద్దరూ ఆయా గ్రామాల్లో విష గుళికలు తిని మృతిచెందారు. మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వారు బలవన్మరణానికి గల కారణాలు తెలియరాలేదు.

సార్వత్రిక విద్యాపీఠం దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), జూలై 30 : సార్వత్రిక విద్యాపీఠం 2024-25 సంవత్సరానికి టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఈవో, విద్యాశాఖ ఏడీ ఆర్ గ్లోరీకుమారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం నుంచి ఆగస్టు 27వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆగస్టు 28 నుంచి రూ.200ల అపరాధ రుసుముతో సెప్టెంబరు 4వతేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. వ్యక్తిగతం గాగానీ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రం, గ్రామ వార్డు సచివాలయం ద్వారా అయినా అభ్యాసకులు దరఖాస్తు చేసుకోవచ్చ న్నారు. మరిన్ని వివరాలకు సార్వత్రిక విద్యాపీఠం అధికారిక వెబ్‌సైట్ apopen-school. ap.gov.inలో పరిశీలించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో సమీపంలోని అధ్యయన కేంద్రంలో గానీ, జిల్లా కోఆర్డినేటర్ ఫోన్ 9000619699 నెంబర్‌నుగానీ సంప్రదించాలని తెలిపారు.

మతోన్మాద రాజకీయాల వల్లే దారిద్ర్యం

● ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

కావలిటౌన్, జూలై 30: మతోన్మాద రాజకీయాల వల్లే దేశంలో దారిద్ర్యం అలుముకుని కోట్లాది మంది పేదలు, కూలీలు దారిద్ర్య రేఖకు దిగువనకు పడి పోతున్నారని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ.సుబ్బా రావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమ్మరాజు అధ్యక్షత ప్రారంభమైన ఏపీ వ్యవ సాయ కార్మిక సంఘం రెండు రోజుల శిక్షణ తరగతు లలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడారు. దేశంలో నడుస్తున్న మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టక పోతే పేదల జీవితాల మనుగడకే ముప్పమన్నారు. వ్యవసా యం ఓపాటు కార్మికులపై తీవ్ర ప్రభావంచూపుతుందని, మతసామరస్యాన్ని దెబ్బతీయడమే దాని లక్ష్యమన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి పేద కూలీల జీవితాలు అతలాకుతలం చేశాయన్నారు. ఉపాధి హామీ చట్టంలోని 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రాష్ట్ర నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, దేవకుమారి, నాగమ్మ, పెంచ లయ్య, పెద్దబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

అత్యాచారయత్నం చేసిన యువకుడిపై దాడి కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 30: బుచ్చి రాఘవరెడ్డి కాలనీకి చెందిన ఓ మహిళపై శనివారం కళ్యాణ్ అనే యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. అయితే ఆ యువకుడిపై పోలీసులు దాడి కేసు నమోదు చేశారని బాధితురాలు మంగళవారం పేర్కొంది. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ తనను ఓ గదిలోకి లాకెళ్లి అత్యాచారం చేయబోయి, దుస్తులు చింపేసి దారుణంగా కొట్టాడని తెలిపింది. అయితే ఆ యువకుడి తల్లి పోలీసులకు మాత్రం దాడి చేసినట్లు చెప్పగా కేసు నమోదు చేశారని పేర్కొంది. తాను రెండు రోజులు స్టేషన్ చుట్టూ తిరిగినా కేసు నమోదు చేయలేదని కన్నీటి పర్యంతమైంది. ఈ విషయపై సీఐ హైమారావును వివరణ కోరగా తాను రెండురోజులు సెలవులో ఉన్నాననీ, బాధితురాలి స్టేట్‌మెంట్‌ను మళ్లీ తీసుకుంటామని తెలిపారు.

సిమెంటు లారీ బోల్తా: డ్రైవర్‌కు స్వల్పగాయాలు

రాపూరు, (డక్కిలి): రాపూరు-పెంచలకోన మార్గంలోని మలుపు వద్ద మంగళవారం కడప నుంచి- నాయుడుపేటకు సిమెంటు లోడుతో వస్తున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సిమెంటు మూటలు లారీ క్యాబిన్‌పై పడటంతో డ్రైవరు నాగేంద్ర సీటులో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకొన్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను బయటకు తీశారు. స్వల్పంగా గాయపడ్డ అతన్ని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రాపూరు ఎస్ఐ తెలిపారు.

పాము కాటుతో బాలిక మృతి

రాపూరు(డక్కిలి): రాపూరు సమీపంలోని వెంకటేశ్వరపురం గిరిజన కాలనీకి చెందిన లత (10) మంగళవారం పాముకాటుకు గురైంది. ఇంటి పరిసరాల్లో ఆడుకుంటుండగా పాము కాటేసిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాలికను ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకెళుతుండగా మృతి చెందినట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

కావలి రూరల్, జూలై 30: మండలంలోని అన్నగారి పాలెం పంచాయతీ వెంకటేశ్వరపురం సమీపంలో మంగళ వారం ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురుకి తీవ్రగాయాలయ్యాయి. రూరల్ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని దళితవాడకు చెందిన చిరుతోటి జగన్ ఆటో తోలుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని తుమ్మలపెంట, అన్నగారి పాలెం ప్రయాణికులను దించుతూ వెంకటేశ్వరపురం బయలుదేరాడు. వెంకటేశ్వరపురం సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ ఆటోను ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్ జగన్‌తో పాటు ఆటోలో ఉన్న ప్రళయకావేరి రమణయ్య, సోమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కావలి వైద్యశాలకు తరలించారు. రూరల్ సీఐ శ్రీనివాస రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కౌలు రైతుకు 'గుర్తింపు'

- ప్రారంభమైన సీసీఆర్‌సీ జారీ ప్రక్రియ
- ముమ్మరంగా గ్రామసభల నిర్వహణ



అనంతసాగరం: రైతులకు అవగాహన కల్పిస్తున్న అనంతసాగరం ఏవో

అనంతసాగరం, జూలై 30: ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు రైతులను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసే కార్యక్రమాన్ని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ప్రారంభించారు. అందుకు పల్లెల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి భూ యజమానులను ఒప్పించేలా అవగాహన సదస్సులు నిర్వహించారు. 11నెలల కాలపరిమితితో సాగు హక్కు పత్రాలను ప్రభుత్వం జారీ చేయనుంది. జిల్లాలో సుమారు 50వేల మంది కౌలురైతులు ఉన్నట్లు అధికారుల ప్రాథమిక అంచనా. అయితే ఏటా వర్షాభావ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలతో వారు నష్టపోతున్నారు. సాగుహక్కు పత్రాలు లేక బీమా పరిహారం, బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర ప్రయోజనాలు సక్రమంగా అందక ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కౌలురైతులు సమస్యలు అధిగమించే దిశగా ప్రభుత్వం సాగు హక్కుదారుల చట్టం 2019 ప్రకారం సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది.

ప్రైవేటు కౌలుతో నష్టం..

చాలా మంది రైతులు ప్రవేటుగా కౌలు తీసుకొనే సాంప్రదాయం నేటికి కొనసాగుతోంది. దీంతో వారికి ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలు, బ్యాంకుల నుంచి పంట రుణాలు అందక అధిక వడ్డీలతో ప్రవేటు వ్యక్తుల నుంచి పెట్టుబడి సాయం తెచ్చుకోంటున్నారు. పంట చేతికందిన వెంటనే వడ్డీతో సహా వారికి చెల్లించాలి. పంట దిగుబడులు తగ్గిన ఇందులో మినహాయింపు లేక కౌలుదారులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. వాటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లోనే సాగు హక్కు పత్రాలు అందించి.. రైతులను ఆదుకొనేలా పనులు ప్రారంభించింది. కౌలు రైతు కార్డు పొందాలంటే భూ యజమాని రాతపూర్వక అగ్రిమెంటు, అడంగల్ తీసు కోవాలి. కొందరు భూ యజమానులు అపోహతో ససేమిరా అంటుండగా వారికి అవగాహన కల్పించే దిశగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించి నిర్దేశిత కాలంలోపు సీసీఆర్‌సీ కార్డులను కౌలు దారులు పొందాలని అధికారులు చెబుతున్నారు.

పూసల కాలనీలో వైద్యశిబిరం



ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

ఉదయగిరి రూరల్, జూలై 30: పట్టణంలోని పూసల కాలనీలో మంగళవారం గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఎం.శివకల్పన ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 30మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా జ్వరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

ఆత్మకూరు, జూలై 30: డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా మహిమలూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవానంద్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది రామస్వామి పల్లిలో మంగళవారం డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవానంద్ మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్ గున్యా తదితర రోగాలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్ల గాలిగొట్టాలకు మెస్‌లు అమర్చుకోవాలని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు వహిస్తే అంటువ్యాధులు దరిచేరవని వివరించారు. అనంతరం ఇంటింట లార్వా సర్వే నిర్వహించి జ్వరపీడుతులు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి షేక్ ఖాదర్‌బాష, హెల్త్ సూపర్‌వైజర్ సైదా, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పొదుపు మహిళలతో ప్రమాదబీమా చేయించాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

ఆత్మకూరు, జూలై 30: పొదుపు మహిళలకు ప్రమాదబీమా పథకంపై అవగాహన కల్పించి బీమా చేయించాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో బ్యాంకర్లు, మెప్మా సిబ్బంది, ఆర్పీలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడారు. పీఎంజేబీవై, సీఎంఎస్ బీవై పథకాలలో పొదుపు మహిళల కుటుంబసభ్యు లందరినీ చేర్పించాలన్నారు. 18నుంచి 70ఏళ్లలోపు వారు రూ.20లు పీమియం చెల్లించిన వారికి రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. పీఎంజేబీవై పథకం ద్వారా రూ.436 చెల్లిస్తే సహజ మరణాలకు రూ.2లక్షల బీమా సౌకర్యం వస్తుందన్నారు. ఆర్పీలందరూ తమ పరిధిలోని పొదుపు మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ టిఎస్ ప్రదీప్ కుమార్, బీఎల్ సురేంద్ర, ఐబీ అంకయ్య, సీవో మాధవి పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు పౌష్టికాహారం

ఆత్మకూరు, జూలై 30: ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఆత్మకూరు అర్బన్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అస్మా తెలిపారు. మంగళవారం ఆమె పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంటశాల, రికార్డులను పరిశీలించారు. వంట మనుషులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. తాజాగా ఉండే కూరగాయలను మాత్రమే ఉప యోగించాలని, విద్యార్థులకు వేడిగా ఉండే ఆహారాన్ని మాత్రమే అందించాలని పేర్కొన్నారు. వంట గదుల్లోకి దోమలు, ఈగలు రాకుండా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించా రు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవోలు పద్మనాభరెడ్డి, స్పందన, ఎంపీ హెచ్‌ఈ సిద్ధం సుధాకర్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉదయగిరి రూరల్, జూలై 30: స్థానిక ఆర్టీసీ డిపో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎన్‌ఎంయూఏ మాజీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రమణరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో డిపో అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిపో పరిధిలో అవసరమైన మేరకు దూరప్రాంత సర్వీసులను పెంచడంతో పాటు రద్దు చేసిన గ్రామీణ ప్రాంతాల సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు మెరుగైన వైద్యసేవలందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. డిపో, యూనియన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అనం తరం డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎం యూఏ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ రెడ్డి, జిల్లా చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డీ.శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి బీ.తిరుపతి, వెంకటేశ్వర్లు, ఆర్‌కే విశ్వనాథ్, విజయ కుమార్, ఫణికుమార్, సలాం పాల్గొన్నారు.

బదిలీ తహసీల్దార్లకు సన్మానం



ఉదయగిరి రూరల్: తహసీల్దారును సన్మానిస్తున్న ఉద్యోగులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 30: బదిలీపై వెళుతున్న మండల తహసీల్దారు యశోదను మంగళవారం కార్యాలయ అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఉన్నతా ధికారులు ఆమెను తిరిగి పూర్వ జిల్లాకు బదిలీ చేశారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ గులాం, వీఆర్వోలు పాల్గొన్నారు.



వరికుంటపాడు: తహసీల్దారును సన్మానిస్తున్న ఉద్యోగులు

వరికుంటపాడు: ఎన్నికల విధుల్లో మండల తహసీల్దారుగా వచ్చిన విజయవాడ సీఆర్‌డీఏ తహసీల్దా రుగా అరుణాదేవి తిరిగి యధాస్థానానికి బదిలీ అయ్యింది. మంగళవారం కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్య క్రమంలో డీటీలు నరసారెడ్డి, చంచయ్య, ఆర్‌ఐ సాయికిరణ్, జూనియర్ అసిస్టెంట్ సుబానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

వరికుంటపాడు, జూలై 30: అధికారులు విధుల్లో బాధ్యతగా వ్యవహరించి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ, వైఎస్ ఎంపీపీ రావిళ్ల నాగేంద్ర, దేవనబోయిన మధు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. కీలక సమావేశానికి వైద్యాధికారితో పాటు పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో సరి కాదని మండిపడ్డారు. వరికుంటపాడు నుంచి జీ.కొండారెడ్డిపల్లి వరకు నూతనంగా నిర్మించిన రోడ్డు సమీపంలోని ప్రమాదకర నేలబావులకు రక్షణగోడలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వరికుంటపాడు సర్పంచ్ దిలీప్‌కుమార్ మాట్లాడారు. ఉపాధి పనులు చేపట్టాలని తీర్మానాలు ఇచ్చినా అధికారులు పనులు కల్పించడంపై మండిపడ్డారు. బస్టాండ్ సెంటర్, కార్యాలయ ఆవరణలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. 24 మంది సర్పంచుల్లో కేవలం ఐదుగురు మాత్రమే సభకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లక్ష్మణ్‌నాయక్, ఎంఈవో రమణయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుంతలమయంగా నల్లపరెడ్డిపల్లి రోడ్డు



ఆత్మకూరు, జూలై 30: మండలంలోని నల్లపరెడ్డిపల్లి తారు రోడ్డు గుంతలమయంగా మారింది. పెద్ద గుంతల్లో వాహనాలతో వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. ఆత్మకూరు నుంచి నల్లపరెడ్డిపల్లికి, నల్లపరెడ్డిపల్లి మీదుగా మురగళ్ల, కనుపూరుపల్లి గ్రామాలకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. నిత్యం రాకపోకలు జరుగుతుండటంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. గతంలో సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో ఈ రోడ్డులో సమయానికి వెళ్లలేక పోతున్నామని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో ఉపాధి పనులు

కలువాయి, జూలై 30: కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం కుల్లూరులో అధికారులు ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. వైసీపీ హయాంలో నాలుగేళ్లుగా ఈ పనులు సరిగా చేయలేదని కొందరు కూలీలు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో కూడా మూడు రోజులు పని చేపట్టి నిలిపివేశారని ఫిర్యా దులో పేర్కొన్నారు. పనులు ప్రారంభం కావడంతో కూలీలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


పనుల పరిశీలన: నూకనపల్లిలో ఉపాధి హామీ కింద జరుగుతున్న పంట కాలువ పనులను మంగళవారం ఎంపీడీవో ప్రభాకర్, ఏపీవో మురళీ తనిఖీ చేశారు. కూలీల మస్టర్లను పరిశీలించారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

సీతారామపురం, జూలై 30: ఉదయగిరి ఫారెస్ట్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు సూచనలు మేరకు ఉదయగిరి రేంజ్‌లోని సీతారామపురం సెక్షన్ డిప్యూటీ రేంజర్ వెంకట ప్రసాద్ సిబ్బందితో మంగళవారం చింతుడు, బోడసిద్ధయిపల్లి, గుండుపల్లి గ్రామాల ప్రజలకు అటవీ, వన్యప్రాణి సంరక్షణ చట్టాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్స్ ఖాజా, గౌతమ్ పాల్గొన్నారు.

గంగమ్మ గ్రామోత్సవం





సంగం, జూలై 30: స్థానిక నిమ్మతోపు సెంటర్ అభయ గంగమ్మతల్లి జాతరలో భాగంగా సోమవారం అర్ధరాత్రి గంగమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవానికి భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఉదయం గంగమ్మతల్లి మూలవిరాట్‌ను పం డ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

సీతారామపురం. జూలై 30: ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, కార్యదర్శి జీవన్ కుమార్‌లు సీతారామపురంలోని పరమటివీధి, హరిజనవాడలో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలోని మురుగు కాలువలలో పూడిక తీయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

చిత్రపటాల అందజేత

వరికుంటపాడు, జూలై 30: స్థానిక మండల పరిషత్, వెలుగు కార్యాలయాలకు గణేశ్వరాపురం గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకులు పేరం సుధాకర్‌రెడ్డి మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి, ఏపీఎం వైనారూత్, జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, తెల్లగొర్ల వెంకటయ్య పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కాలువలు ఆక్రమించి

ఇళ్ల నిర్మాణాలు!

- పట్టించుకోని అధికారులు



అరటితోటలో కాలువ స్థలంలోకి వచ్చిన ఇంటి నిర్మాణం

కావలి, జూలై 30 : కావలి పట్టణం పాతూరులోని అరటితోటలో కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆ ప్రాంతం ఇటీవల కాలువలు, రోడ్లు సైతం ఆక్రమించి నూతన నిర్మాణాలు విస్తరిస్తున్నా, నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోయినా పట్టించుకునేవారు కరువయ్యారు. పట్టణ పరిధిలో ఉన్న లేఅవుట్ల మధ్యలో ఇటీవల అధికారులు అడ్డ కాలువను సర్వే చేయగా దానిని ఆక్రమించి అనేక మంది నిర్మాణాలు చేట్టినట్లు తేలింది. అయితే కొన్నిచోట్ల కొన్ని నిర్మాణాలు పూర్తిగా కాలువ పరిధిలోకి రావడంతో అప్పటికే నిర్మాణాలు పూర్తి చేసి ఉన్నందున వాటిని వదిలి కాలువ నిర్మాణం చేపట్టారు. ఆ కాలువ సర్వే చేసి వేసిన మార్కింగ్ చూస్తే కాలువ లోపలకు ఇళ్ల నిర్మాణం కనిపిస్తోంది. అలాగే ఆ ప్రాంతంలో నూతనంగా చేపడుతున్న నిర్మాణాలలో అనేక చోట్ల డ్రైనేజీలు ఆక్రమణకు గురవుతోన్నాయి. మరి కొన్ని చోట్ల వాస్తవంగా ఉండాల్సిన డ్రైనేజీలను ఇష్టానుసారంగా దారి మళ్లించి నిర్మాణాలు చేపట్టారు. అలాంటి చోట మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులిచ్చారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నూతన నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చేటప్పుడు సర్వేయర్ స్కెచ్ తీసుకోవాలి. వారు నిర్మిస్తున్న స్థలంలో ప్రభుత్వ స్థలం ఉందేమోనని నిర్ధారణ చేసుకుని ఇస్తే భవిష్యత్‌లో సమస్యలు ఉండవని ప్రజలు కోరుతున్నారు.

కందుకూరుకు వెలిగొండ జలాలు

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరిస్తున్న గ్రామస్థులు

కందుకూరు, జూలై 30: కందుకూరు నియోజకవర్గానికి వెలిగొండ ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలు తెచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మోపాడులో మంగళవారం ఎమ్మెల్యేకి ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ శివార్లలో ఉన్న సాయిబాబా ఆలయం నుంచి రామాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఘనంగా సత్కరించారు. అనంతరం పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నుంచి కందుకూరు, కనిగిరి, కొండపి నియోజకవర్గాలలో సాగునీటి వసతిలేని భూములకు సాగునీటి వసతి కల్పనకు ప్రత్యేక కాలువ తవ్వేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌లు అంగీకరించారని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు తూర్పు కాలువ నుంచి ఈ మూడు నియోజకవర్గాలకు ప్రత్యేక కాలువకు రూ.350 కోట్లు అవుతుందని అంచనా వేస్తున్నారన్నారు. త్వరలోనే సర్వే ప్రారంభమవుతుందని, ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే కందుకూరు నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రం గురించి, ప్రజల బాగోగుల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తుంటే మాజీ సీఎం జగన్ మాత్రం ఇంకా తన వెకిలి బుద్ధితోనే ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. గత ఎన్నికల్లో మోపాడు గ్రామస్థులు తనకు మంచి మెజార్టీ అందించారని, గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నార్నె రోశయ్య, దామా మల్లేశ్వరరావు, మాదాల లక్ష్మీనరసింహం, తోకల వెంకటేశ్వర్లు, రావుల రవి, తోకల నరసింహం, వీరయ్య, నాగినేని సురేష్, బొడపాటి నరసింహారావు, తన్నీరు ఏడుకొండలు, బొడపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ఎమ్మెల్యే కావ్య పూజలు



పూజా కార్యక్రమాలల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య

కావలి రూరల్, జూలై 30: మండలంలోని రాజువారిచింతలపాలెంలో మంగళవారం జరిగిన గంగమ్మ పొంగళ్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. గంగమ్మను దర్శించుకుని వర్షాలు సంవృద్ధిగా కురవాలని, పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, బ్రహ్మయ్య స్వామి, మాజీ సర్పంచు గుంటూరి మల్లికార్జున్, టీడీపీ నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, పంకు తాతయ్య, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభించండి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ

లింగసముద్రం, జూలై 30 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని కందుకూరు క్లస్టర్ ఏపీడీ జే.బాబూరావు చెప్పారు. మంగళవారం ఆయన లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ ఏపీవో షేక్ సమీర్‌బాషా సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పనులు గుర్తించాలని, కూలీల సంఖ్య పెంచాలని చెప్పారు. అంతకుముందు ఆయన చినపవని, అన్నెబోయినపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, మస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ చిన కోటయ్య, టీఏలు, బీఎఫ్‌టీ, తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన యువకుడిపై కేసు

అల్లూరు, జూలై 30 : మద్యం సేవించి స్నేహితుడిపై విచక్షణా రహితంగా దాడి చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి కథనం మేరకు.. అల్లూరు సెటిల్మెంట్ ప్రాంతానికి చెందిన జాన్‌పాల్, బానిపాల్, రంజిత్ అనే ముగ్గురు యువకులు ఈనెల 13న విడవలూరు మండలం పొన్నపూడిలో పనికి వెళ్లారు. పని చూసుకున్న అనంతరం ముగ్గురు సముద్ర తీరాన మద్యం సేవించారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురూ ఒకే ద్విచక్ర వాహనంపై వస్తుండగా బానిపాల్ ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడపడంతో తనకు తల తిరుగుతుందని, వాహనాన్ని ఆపాలని జాన్‌పాల్ కోరినప్పటికీ వినకపోవడంతో బానిపాల్‌ను దుర్భాషలాడాడు. దీంతో వాహనాన్ని ఆపి జాన్‌పాల్‌పై బానిపాల్ విచక్షణా రహితంగా దాడిచేశాడు. పక్కనే ఉన్న రంజిత్ ఇదంతా వీడియో తీయగా మంగళవారం వైరల్ అయింది. వీడియో చూసిన జాన్‌పాల్ కుటుంబ సభ్యుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా బానిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ అధ్యక్షురాలు స్వర్ణలత

కావలి రూరల్, జూలై 30: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు స్వర్ణలత పేర్కొన్నారు. మండలంలోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ వారి సౌజన్యంతో మంగళవారం ప్లాంటేషన్, బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. విద్యార్థులకు మొక్కలు నాటే ఆవశ్యకతను వివరిస్తూ, రక్త పరీక్షలతోపాటు గ్రూపు నిర్ధారణలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ, రోటరీ క్లబ్ నిర్వాహకులు మాధవరెడ్డి, నెల్లూరు రవికుమార్, రమేష్‌రెడ్డి, సురేష్, హరినారపరెడ్డి, సాయివిఠల్, టీం సేవియర్స్ సభ్యులు ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



హెల్మెట్‌పై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

కావలిటౌన్, జూలై 30: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని లీగల్ ఎయిడ్ మెంబర్ ఐ సాయిప్రసాద్ పేర్కొన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అడవి రాజుపాలెంలో న్యాయ విజ్ఞాన సదస్సు, హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, న్యాయవాదులు చంద్రశేఖర్‌రెడ్డి, సాయికృష్ణ, ద్విచక్రవాహన దారులు పాల్గొన్నారు.

3న కలిగిరి మండల సమావేశం

కలిగిరి, జూలై 30: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆగస్టు 3న ఎంపీపీ మెట్టుకూరి శిరీష ఆధ్వర్యంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో రంగసుబ్బరాయుడు తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి శాఖలవారీగా నివేదికలతో అధికారులు హాజరు కావాలని కోరారు.

లారీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

అల్లూరు, జూలై 30 : అల్లూరు పట్టణంలోని చింతగుంట సమీపంలో మంగళవారం లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బాధితుల కథనం మేరకు... అల్లూరు నుంచి చింతగుంట వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అల్లూరుకు చెందిన మేడా రమేష్‌రెడ్డిని వెనుక నుంచి ఉప్పు లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనతో రమేష్‌రెడ్డి అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరంమెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవరు మద్యం సేవించి ఉండడంతో వేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న రమేష్‌రెడ్డిని ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు లారీని, డ్రైవరును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలుషిత నీరు సరఫరా

లింగసముద్రం, జూలై 30 : రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా భారీ మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేసు న్న నీరు కలుషితమై వస్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడ్లూరు ఫేస్-1, ఫేస్-2, రాళ్లపాడు-రాళ్లపాడు మంచినీటి పథకాల నుంచి పురుగులతో కూడిన కలుషిత నీరు వస్తోందని మండలంలోని పెదపవని, చిన పవని, వెంగళాపురం గ్రామాలకు చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిల్టర్ పాయింట్స్‌లో నీటిని సరిగా ఫిల్టర్ చేయకుండానే నీరు వస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరు పరిశుభ్రంగా వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శాకాంబరి అలంకారంలో కామాక్షి



కందుకూరు, జూలై 30: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో వెలసిన కామాక్షి సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం అమ్మవారికి శాకాంబరి అలంకా రం నిర్వహించారు. ఆలయ అర్చకులు అన్నమాచార్యులు అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరణ చేయగా భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో భక్తులు, అయ్యప్పస్వామి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వెల్లటూరివారిపాలెంలో శుభ్ దిన్ భోజన్

కొండాపురం, జూలై 30: మండలంలోని సాయిపేట పంచాయతీ వెల్లటూరివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా శుభదిన్ భోజన్ కార్యక్రమం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్లు, బిస్కెట్లు, పండ్లు అందచేశారు. అనంతరం కొండాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పుస్తక పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఓపీ నరసయ్య, ఉపాధ్యాయని మృదుల పాల్గొన్నారు.

పాఠశాలకు ఇనుప గేటు ఏర్పాటు

చిత్రగుంట, జూలై 30: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులోని ప్రాథమిక పాఠశాలకు ఏర్పాటు చేసిన ఇనుప గేటును దాతలు మంగళవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన పసుపులేటి సాయిబాబా, లక్ష్మి దంపతులు వారి కుమారుడు పసుపులేటి హర్షభరత్ జ్ఞాపకార్థం వారు ఇనుప గేట్లు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు నరసింహారావు, జయమ్మ, పాఠశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్ మద్దులూరి ప్రసాద్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొని పసుపులేటి దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని విజయ, బూర్గురాజు పాల్గొన్నారు.

తిమ్మారెడ్డిపాలెంలో పారిశుధ్య పనులు

లింగసముద్రం, జూలై 30 : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి షేక్ గౌస్ బాషా ఆధ్వర్యంలో మురుగు కాలువల్లో మురుగు, చెత్తా చెదారాన్ని సిబ్బంది తొలగించారు. కాలువల్లో దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించారు. ఈ పనులను ఎంపీడీవో కె శ్రీనివాసులు పర్యవేక్షించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు.

ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు : సోమిరెడ్డి


ఎమ్మెల్యే సోమిరెడ్డిని సత్కరిస్తున్న బలిజ సంఘం నాయకులు

పొదలకూరు, జూలై 30 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్ల నుంచి పుస్తకాలను పంపిణీ చేయలేదన్నారు. గత ప్రభుత్వంలో సీఎంగానీ, మంత్రులుగానీ శాఖలవారీగా సమీక్షలు నిర్వహించలేదన్నారు. పొదలకూరులో బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, జనసేన నేత బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, ఆదాల సుగుణమ్మ, అక్కెం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఘనంగా హనుమజ్జయంతి

పట్టణంలోని శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డిఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడో రేపో కండలేరు, సోమశిల జలాశయాలకు కృష్ణా జలాలు చేరనున్నాయన్నారు. అనంతరం సోమిరెడ్డిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కాగా మధ్యాహ్నం అన్నదానం, రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బలిజ సేవా సంఘం నాయకులు, యూత్, మహిళలు పాల్గొన్నారు.

వివాదరహితుడిగా సేవలు


తహసీల్దార్‌ని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

విడవలూరు, జూలై 30: తహసీల్దారు శ్రీనివాసులు వివాదరహితుడిగా ప్రజలకు సేవలందించారని రెవెన్యూ అధికారులు కొనియాడారు. బదిలీపై వెళుతున్న ఆయన్ను సోమవారం డీటీ భానుప్రకాష్, ఆర్‌ఐ సిరాజ్, సర్వేయర్ శోభన్‌బాబు, వీఆర్వోలు, వీఆర్‌వోలు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ వివాదాలు, సమస్యలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించారని పేర్కొన్నారు.

మాతృభాషలోనే విద్యాబోధన సాగించాలి


వినతిపత్రం ఇచ్చిన యూటీఎఫ్ నాయకులు

కోవూరు, జూలై 30: ప్రాథమిక పాఠశాలల్లో మాతృభాషలోనే విద్యాబోధన సాగాలని యూటీఎఫ్ నాయకులు మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాల్ని రద్దు చేయాల్సిందిగా వారు కోరారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చలపతిశర్మ, కే శ్రీనివాసప్రసాద్, వెంకటేశ్వర్లు, కే భారతి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం ఎస్‌ఐగా వీరప్రతాప్


బాధ్యతలు చేపట్టిన వీరప్రతాప్

వెంకటాచలం, జూలై 30 : వెంకటాచలం ఎస్‌ఐగా వీరప్రతాప్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రులు చోరీలు జరగకుండా గస్తీని మరింతగా పెంచుతామన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ఆలయంలో ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బుచ్చిరెడ్డిపాళెం,జూలై 30: మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఆడికృత్తిక (సుబ్రహ్మణ్యేశ్వరుడి జన్మనక్షత్రం) సందర్భంగా మంగళవారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్లకు పాలు, పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలంకరణ చేసి, మంగళవాయిద్యాలతో ఆలయంలో ఊరేగించారు. కార్యక్రమానికి చిట్టమూరు వెంకటరెడ్డి, కుటుంబం ఉభయకర్తలుగా వ్యవహరించింది. ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

● నేటి నుంచి సారె సమర్పణ

జొన్నవాడ ఆలయంలో బుధవారం నుంచి ఆగస్టు 3 వరకు కామాక్షితాయికి ఆషాడ మాస సారె సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ. శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలలనుంచి భక్తులు తరలి వచ్చి పాల్గొనాలని ఆయన కోరారు.

ఎస్సీ హాస్టల్ పరిశీలన

పొదలకూరు, జూలై 30: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్‌ను మంగళవారం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిశీలించారు. ఇటీవల ఆంధ్రజ్యోతితోపాటు వివిధ పత్రికల్లో ఈ హాస్టల్‌లో ప్రహరీ లేకుండా పట్టలు కట్టివున్న దుస్థితి, శ్లాబు దెబ్బతిన్న కథనాలను ప్రచురించాయి. దీంతో ఆయన స్థానిక అధికారులతో మాట్లాడి అద్దె భవనంలోకి హాస్టల్‌ను తరలించడంగానీ తక్షణమే మరమ్మతులు చేయించేలాగానీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్థలం కబ్జాను అడ్డుకున్న కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం,జూలై 30: బుచ్చి నగర పంచాయతీలోని రామకృష్ణానగర్‌లో మంగళవారం పంచాయతీ స్థలం కబ్జాను కమిషనర్ రమణబాబు అడ్డుకున్నారు. ఈ మేరకు కబ్జాదారులను ఆయన హెచ్చరించారు. మళ్లీ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలో ఇటీవల స్థలాల ఆక్రమణలు పెరిగిపోయాయని, వీటిపై కూడా కమిషనర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఉపాధి' పనుల్లో అక్రమాలపై విచారించాలి


జడ్పీ సీఈవోకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

నెల్లూరు, జూలై 30: విడవలూరు మండలం చౌకిచర్లలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో వైసీపీ నాయకుల అండతో ఫీల్డ్ అసిస్టెంట్ భారీగా అక్రమాలకు పాల్పడ్డాడని టీడీపీ నాయకులు కొల్లు వెంకయ్య, హరిప్రసాద్ మంగళవారం ఇన్‌చార్జి డ్వామా పీడీ శ్రీనివాసులు, జడ్పీ సీఈవో అంకమ్మనాయుడులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ జరపాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఫీల్డ్‌అసిస్టెంట్ ఉపాధి హామీ పథకం నిధులను బినామీ పేర్లతో దుర్వినియోగం చేశాడన్నారు. ఇంకుడు గుంతలను తవ్వకుండా నిధులను డ్రా చేశారని తెలిపారు. పాత మరుగుదొడ్లను కొత్తగా కట్టినట్లు బిల్లు పెట్టుకుని రూ. లక్షలు కాజేశారని ఆరోపించారు. చనిపోయిన వారిపేర్లు, ప్రభుత్వం ఉద్యోగాలు చేస్తున్న వారిపేర్లు, వైసీపీ నాయకుల పేర్లను మస్టర్లలో చేర్చి నిధులను పక్కదారి పట్టించారని విమర్శించారు. జాబ్‌కార్డులు కలిగిన కూలీలకు సక్రమంగా పనిదినాలు కల్పించకుండా ఇబ్బంది పెట్టాడని పేర్కొన్నారు. జిల్లాఉన్నతాధికారులు తగిన విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంబటి సుమన్, కోటయ్య గర్రేటి వెంకటయ్య, వెంకటేశ్వర్లు, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వాధినేతల చిత్రపటాల బహూకరణ


ప్రభుత్వాధినేతల చిత్రపటాలను బహూకరిస్తున్న టీడీపీ నేతలు

పొదలకూరు, జూలై 30 : మండలంలోని డేగపూడి సచివాలయానికి గ్రామ టీడీపీ నాయకులు మంగళవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చిత్రపటాలను సచివాలయ ఉద్యోగులకు అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు మద్దినేని భాస్కర్‌నాయుడు, గంట మల్లికార్జున్‌యాదవ్, నోటి శ్రీనివాసులురెడ్డి, దాసినేని శ్రీనుచౌదరి, నోటి పెంచలరెడ్డి, పరంధామరాజు, సోంపల్లి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల సందర్శన : తెగుళ్ల నివారణకు సూచనలు


వరి దుబ్బులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి, రైతులు

ఇందుకూరుపేట, జూలై 30 : మండలంలోని జగదేవిపేటలో మంగళవారం మండల వ్యవసాయాధికారి డీ.రఘునాథరెడ్డి వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పొలాల్లోని వరి దుబ్బులను ఎలుకలు కొరికి నాశనం చేయడం, అలాగే ఆకు ముడత పురుగు, కంకినల్లి తాకిడి ఉన్నట్లు గమనించారు. వీటి నివారణ చర్యలను ఆయన తెలియచేశారు.

● ఎలుకల నివారణకు చర్యలు

100 గ్రాముల బ్రోమోడైలీస్ మందు, 5, 6 కేజీల నూకలు, 100గ్రాముల వంటనూనెను కలిపి మిశ్రమంగా చేసుకోవాలి. ఈ మిశ్రమం 35 నుంచి 40 ఎకరాల వరి పొలాలకు సరిపోతుంది. ఈ మిశ్రమాన్ని పొలాల గట్లపై ఎలుకల బొరియలు ఉండే చోట ఉంచడం వల్ల, వాటిని తిని ఎలుకలు నశిస్తాయన్నారు.

● ఆకు, కంకినల్లి నివారణకు..

ప్రొపోనోపాస్ రెండు మిల్లీమీటర్లుకు లేదా స్పైరోమెసిఫెన్ మిల్లీలీటరు లేదా ప్రోపర్గిట్ 1.5లీ టర్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

● ఆకుముడత పురుగు నివారణకు...

పిలక దశలో క్లోరంట్ల నీలిపోర్ 0.3మిల్లీలీటరు లేదా క్లోరిపైర్పాస్ 2.5లేదా మోనోక్రోటోపస్ 1.6మిల్లీలీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. చిరు పొట్టదశలో కాంటాక్ట్ హైడ్రోక్లోరైడ్ 2గ్రాములు లేదా ఎసిఫేట్ 1.5గ్రాములు లేదా ఫ్లుబెండమైడ్ 0.1మిల్లీలీటరు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు నవీన్, జగదేవిపేట గ్రామ రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్‌పై వాడకంపై అవగాహన ర్యాలీ


హెల్మెట్ ధరించి మోటార్ బైక్ నడుపుతున్న వీసీ తదితరులు

వెంకటాచలం, జూలై 30 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ, యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించేందుకు మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి వీసీ డాక్టర్ ఎస్ విజయ భాస్కర్‌రావు పాల్గొని ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులందరూ విధిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా వారి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. తొలుత ర్యాలీ యూనివర్సిటీ నుంచి కాకుటూరు మీదుగా వెళ్లి తిరిగి జాతీయ రహదారి వెంబడి యూనివర్సిటీకి చేరింది. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ కే వాణి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, మహేంద్రరెడ్డి, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ కోల నీలమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పంటకు తెగుళ్లపై స్పందించిన వ్యవసాయ అధికారులు


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

తోటపల్లిగూడూరు, జూలై 30 : 'ముసురుతో పంటకు తెగుళ్లు-ఆందోళనలో అన్నదాతలు' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వ్యవసాయ అధికారులు మంగళవారం పేడూరులో పంటపొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి మాట్లాడుతూ వరిలో ఆకునల్లి, కాండం తొలిచే పురుగు, కుళ్లు తెగులు సోకాయని, వాటి వల్ల వచ్చే నష్టాలను రైతులకు ఆమె వివరించారు. నివారణ చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డీపీవో శివనారాయణ, ఏడీఏ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

తోటపల్లిగూడూరు : మండలంలోని చిన్నచెరుకూరు అరుంధతీవాడలో సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కామంచి ప్రసాద్ (30) కుటుంబాన్ని మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, కోడూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

గురుమహేంద్ర కుటుంబాన్ని ఆదుకుంటాం

● రూ.5లక్షల అందించిన రూరల్ ఎమ్మెల్యే


పరిహారం చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (విద్య), జూలై 30 : బీవీనగర్ కేఎన్‌ఆర్ పాఠశాలలో నూతన భవన గోడ కూలి మృతిచెందిన కొత్తపాళెం గురు మహేంద్ర (14) కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజతో కలిసి మహేష్ నివాసానికి వెళ్లి ప్రభుత్వం తరపున రూ.5లక్షల పరిహారాన్ని అందజేశారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని, విషయం తెలిసిన వెంటనే మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి స్పందించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో మాట్లాడి రూ.5లక్షల పరిహారం ప్రకటించారన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి నెల్లూరులో ఇంటి స్థలం ఇచ్చే బాధ్యతను తాము తీసుకుంటామన్నారు. జరిగిన సంఘటనపై కలెక్టర్ ప్రత్యేక కమిటీతో విచారణ చేయిస్తున్నారని, మానవ తప్పిదం అయితే కచ్చితంగా బాధ్యులపై చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రకటించారు.


అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ

రోడ్లకు మరమ్మతులు చేయండి

● అధికారులకు ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ ఆదేశం

నెల్లూరు(సిటీ), జూలై 30 : నెల్లూరు నగరంలో దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, నగర కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబరులో ఎన్‌ఎంసీ ఇంజనీర్లు, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ట్రంకురోడ్డు, మినీబైపాస్‌రోడ్డు, పొదలకూరురోడ్డుపై గుంతలు ప్రజలకు ఇబ్బందికరంగా మారాయన్నారు. ఆయా రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న వృక్షాలను తొలగించే క్రమంలో ఎన్‌ఎంసీకి కచ్చితంగా సమాచారం అందించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. తొలగించిన చెట్ల కొమ్మలను రోడ్లపై వదిలేయవద్దని తెలిపారు. సూర్యగృహ యోజనలో భాగంగా నగరంలో సోలార్ విద్యుత్ సౌకర్యం కలిగిన భవనాల వివరాలు సమర్పించాలని సూచించారు.

జిల్లాకు 17 ఎఫ్‌పీవోల నమోదు

● ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

నెల్లూరు(హరనాథపురం), జూలై 30 : నెల్లూరు జిల్లాకు 17 రైతు ఉత్పత్తిదారుల సంస్థలు(ఎఫ్‌పీవోలు) నమోదైనట్లు కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ లోక్‌సభలో తెలిపారు. మంగళవారం లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆంధ్ర ప్రదేశ్‌కు, నెల్లూరు జిల్లాకు ఎన్ని ఎఫ్‌పీవోలు నమోదైనాయని ప్రశ్నించగా కేంద్రమంత్రి సమాధానమిస్తూ నెల్లూరు జిల్లాకు 17 ఎఫ్‌పీవోలు నమోదైనాయని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 449 ఎఫ్‌పీవోలు నమోదైనాయని చెప్పారు. సామాజిక- ఆర్థిక అభివృద్ధికి, వ్యవసాయ వర్గాల శ్రేయస్సు కోసం ఇవి ఉపయోగపడుతాయని వివరించారు.

నియోజకవర్గాన్ని నెంబర్‌వన్‌గా చేస్తా..

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, జూలై 30 : రాష్ట్రంలో కీలక శాఖల మంత్రులతో పాటు జిల్లా మంత్రులను సమన్వయం చేసుకుని అందరి సహకారం తో నెల్లూరు రూరల్ నియోజక వర్గాన్ని రాష్ట్రంలోనే నెంబరు వన్ స్థానంలో నిలబెడతానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం 36వ డివిజన్ రామయ్యబడి ప్రాంతంలో రూ. 1.10 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, నాయకుడు రాజానాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు (విద్య), జూలై 30 : పాఠశాలల్లో ఉపాధ్యాయినులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ మహిళా టీచర్స్ అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను తెలియచేశారు. విధి నిర్వహణలో తాము పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి వితపు రాధారాణి, గౌరవ సలహాదారురాలు సుధావాణి, వ్యవస్థాపక అధ్యక్షురాలు సరస్వతీ పద్మజ, జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్నారా తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌తో గిరిధర్‌రెడ్డి భేటీ

నెల్లూరు(సిటీ), జూలై 30 : టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఎం సూర్య తేజను మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ నియోజకవర్గంలోని మున్సిపల్ డివిజన్లలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలు వుతీరిన నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని, డ్రైన్లు, రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు గిరిధర్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకు లు అరవ శ్రీను, నూకరాజు మదన్ కుమార్‌రెడ్డి, చక్రవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా నగరోత్సవం


గంధర్వ వాహనంపై షిరిడీ సాయిబాబా

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 30 : గురుపౌర్ణమి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి ట్రంకు రోడ్డు గాంధీనగర్ షిరిడీ సాయిబాబా నగరోత్సవం వైభవంగా జరిగింది. సాయిబాబాకు గంధర్వ వాహనంపై విశేష పుష్ప, విద్యుత్ దీపాల అలంకరణతో నగరోత్సవం జరిగింది. కోలాట ప్రదర్శన, కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గాంధీ బొమ్మ, ట్రంకురోడ్డు, ఏసీ సెంటర్, చిన్నబజారు, పెద్దబజారు మీదుగా మంగళవారం ఉదయం మందిరానికి నగరోత్సవం చేరుకుంది. ఆలయ చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. మంగళవారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

మూలస్థానేశ్వరాలయంలో ఆడికృతిక ఉత్సవం


పేట ఉత్సవంలో సుబ్రహ్మణ్య స్వామి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 30 : నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సుబ్రహ్మణ్య స్వామికి ఆడి కృతిక పూజలు ఘనంగా జరిగాయి. విశేష అభి షేకాలు జరిపి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పేట ఉత్సవం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కుష్టుపై నిర్లక్ష్యం వద్దు : ఏడీఎంహెచ్‌వో

నెల్లూరు(వైద్యం) జూలై 30 : కుష్టువ్యాధిపై ఎలాంటి నిర్లక్ష్యం వద్దని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. మంగళవారం నగరంలోని కపాడిపాళెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాంతీయ సమావేశం జరిగింది. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడా రు. ప్రస్తుతం కుష్టువ్యాధి సర్వే జరుగుతోందని, కొత్త కేసులు గుర్తిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. క్షయ నివారణకు 60 ఏళ్ల పైబడిన వారికి వేసే బీసీజీ వ్యాక్సిన్ పంపిణీ సక్రమంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యుడు కల్యాణ్, డీఆర్‌డీటీ కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ పెంచాలి

నెల్లూరు(హరనాథపురం), జూలై 30 : విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు 10 నుంచి 15 శాతం అడిషనల్ క్వాంటమ్ పెన్షన్‌ను పెంచాలని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ ముఖ్యమంత్రి చంద్రబాబుని ఓ ప్రకటనలో కోరారు. సచివాలయ, డిపార్టుమెంటు హెడ్‌లకు హెచ్‌ఆర్‌ఏను 24 శాతం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వు లు ఇవ్వటం అభినందనీయమన్నారు. 70 ఏళ్లున్న విశ్రాంత ఉద్యోగులకు 10శాతం, 75 సంవత్సరాలు ఉన్నవారికి 15 శాతం అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ పెంచాలని విజ్ఞప్తి చేశారు.

కూలీల కొరతకు డ్రోన్లతో ప్రత్యామ్నాయం

నెల్లూరు రూరల్, జూలై 30 : వ్యవసాయ రంగంలో రైతులను వెంటాడుతున్న ప్రధాన సమస్య కూలీలేనని బాలా గ్రూప్ సంస్థ అధినేత ఎన్వీ మాధవ్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తవెల్లంటిలో ఏరీస్ సంస్థ తయారు చేసిన డ్రోన్ల గురించి రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. డ్రోన్ల వాడకం వల్ల రైతు కూలీ సమస్యను నివారించవచ్చన్నారు.

కుదవ వ్యాపారి మోసం

● పోలీసులకు మహిళల ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), జూలై 30: కుదవపెట్టిన బంగారు ఆభరణాలు నకిలీవంటూ కుదవ వ్యాపారి మోసం చేశాడంటూ మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల్లూరులోని వేదాయపాళెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితుల సమాచారం మేరకు... పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం సరిసల్లి గ్రామానికి చెందిన ఉషారాణి తన ఇద్దరు పిల్లలు, తల్లి భవానీతో కలిసి నెల్లూరు నగరంలోని పడారుపల్లిలో నివాసం ఉంటున్నారు. ఆమె ప్రస్తుతం న్యాయవిద్యను అభ్యసిస్తున్నారు. తన తాలూకు 141.54 సవర్ల బంగారు ఆభరణాలను తమకు బాగా తెలిసిన నర్సాపురంలోని ఓ బంగారు వ్యాపారికి చెందిన దుకాణంలో కుదవపెట్టి రూ.47.40 లక్షలు తీసుకున్నారు. ప్రతినెల వడ్డీ చెల్లిస్తున్నారు. ఇటీవల ఉషారాణి, భవానీ నర్సాపురం వెళ్లి తమకు నగదు అవసరమని తాకట్టులోని బంగారు ఆభరణాలను విక్రయించి కుదువ తాలూకు నగదు తీసుకుని మిగిలినది ఇవ్వాలని కుదువ వ్యాపారిని కోరారు. తాకట్టులో ఉన్న ఆభరణాలు నకిలీవని, మీరే నగదు చెల్లించాలని వ్యాపారి సూచించారు. దీంతో బాధితురాలు రెండు రోజుల కిందట వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ సంఘటన జరిగిన ప్రదేశం నరసాపురం కావడంతో తదుపరి విచారణ నిమిత్తం కేసును అక్కడి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు.

● అక్రమంగా కేసు నమోదు చేశారు!

నెల్లూరు (సాంస్కృతికం): ఉషారాణిపై పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం టౌను పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారని నేషనల్ హ్యూమన్‌రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి కనుపూరు శ్రీనివాసులు ఆరోపించారు. మంగళవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాము కుదువ పెట్టిన బంగారాన్ని విక్రయించి అప్పు మొత్తం పోగా మిగిలిన నగదు ఇవ్వాలని ఉషారాణి, అమె తల్లి భవానీ కుదువ వ్యాపారిని కోరారన్నారు. అయితే ఆ వడ్డీ వ్యాపారి... తన వద్ద గిల్టు నగలు కుదువ పెట్టి మోసం చేశారంటూ తల్లీకూతుళ్లను బూతులుతిట్టి చంపేస్తామని బెదిరించాడని ఆరోపించారు. దీంతో ఉషారాణి, ఆమె తల్లి ప్రాణభయంతో నెల్లూరుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అయితే నరసాపురం పోలీసులు కుదువ వ్యాపారి దుకాణంలో సీసీ కెమెరాలు పరిశీలించకుండా, ఆయన స్టాకు రికార్డులు పరిశీలించకుండా ఏకపక్షంగా కేసు నమోదు చేశారని విమర్శించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం, మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళుతున్నామని తెలిపారు.

పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పవన్

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 30 : నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ జిల్లా అధ్యక్షుడిగా కలిమేలి పవన్‌కుమార్ నియమితులైనారని ఆ కమిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, జిల్లా కో ఆర్డినేటర్ పెసల శ్రీనివాసులు తెలిపారు. ఆయన మంగళవారం జర్నలిస్టు భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అనంతరం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మెహబత్ రాయ్ జారీ చేసిన నియామక పత్రాన్ని పవన్‌కు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పలువురు హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టు భవన్ పునఃప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 30 : నగరంలోని ఆచారివీధిలో కలెక్టర్ కార్యాలయానికి ఎదురుగా జర్నలిస్టు భవన్ పునఃప్రారంభ వేడుకలు మంగళవారం జరిగాయి. ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఏసీ సుబ్బారెడ్డి, మదీనా వాచ్ అధినేత ఇంతియాజ్ హాజరయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమాజసేవ చేస్తున్న జర్నలిస్టులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, బీమా సౌకర్యాలు వంటివి మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అన్ని వసతులతో నూతన ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టి సత్యనాగేశ్వరరావు, జర్నలిస్టు భవన్ కమిటీ అధ్యక్షుడు ఐ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.









కిటకిటలాడుతున్న ఆనందగిరి

ఆడికృత్తిక ఉత్సవాలు

నేత్రపర్వం.... తెప్పోత్సవం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమార స్వామి ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామిని అలంకార మండపంలో విశేషంగా అలకరించి మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య నారద పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు.తెప్పలపై అధిష్ఠింపజేసి పూజలు చేశారు. అనంతరం విద్యుత్ దీపకాంతుల మధ్య పుష్కరిణిలో తెప్పపై విహరించిన కుమారస్వామిని దర్శించుకుని భక్తులు పులకించిపోయారు.ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి



కన్నులపండువగా కల్యాణోత్సవం

పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వళ్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామికి మంగళవారం ఉదయం కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు.కళ్యాణోత్సవానికి పూజ సామగ్రి, పూలమాలలను ఎమ్మెల్యే పులివర్తి నాని సమర్పించారు. స్వామివారికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆడికృత్తికను పురస్కరించుకొని స్వామివారి దర్శనానికి ఉదయం నుంచీ రాత్రి వరకు భక్తులు బారులు తీరారు. పుష్పకావిళ్లు, తలనీలాలు సమర్పించి స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు.రాత్రి ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన పల్లకిలో వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో విహరించారు. - పాకాల



- పాత, ఇతర ప్రాంత కేసులు కలిపి 3848మంది ఆచూకీ లభ్యం
- బాలికలు, యువతులు, మహిళల అదృశ్యంపై లోక్‌సభలో హోం శాఖ సహాయ మంత్రి వెల్లడి

తిరుపతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాలికలు, యువతులు పెద్ద సంఖ్యలో అదృశ్యమవుతున్నారంటూ ఇదివరకూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలు ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. రాష్ట్రం పరువు ప్రతిష్టలు దెబ్బ తీసేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ అప్పట్లో వైసీపీ వర్గాలు ఆయనపై విరుచుకుపడ్డాయి. అయితే తాజాగా మంగళవారం సాక్షాత్తూ లోక్‌సభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి వెల్లడించిన వివరాలు గత వైసీపీ పాలకులకు చెంపపెట్టుగా పరిణమించింది. ఏపీ మొత్తం సంగతి పక్కన పెట్టి ఒక్క తిరుపతి జిల్లా వరకే చూస్తే గడచిన ఐదేళ్ళలో ఏకంగా 3746 మంది బాలికలు, యువతులు, మహిళలు అదృశ్యమయ్యారు.అదే సమయంలో ఈ ఐదేళ్ళ వ్యవధిలో పోలీసు యంత్రాంగం 3848 మంది ఆచూకీని కనుక్కోగలిగింది. 2019కి ముందు అదృశ్యమైన వారి, అలాగే ఇతర ప్రాంతాల్లో అదృశ్యమైన వారి ఆచూకీ జిల్లాలో లభించడం వల్ల అదృశ్యమైన వారి సంఖ్య కంటే ఆచూకీ దొరికిన వారి సంఖ్య స్వల్పంగా ఎక్కువగా కనిపిస్తోంది.

2019లో 579 మంది అదృశ్యం

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 2019లో 18 ఏళ్ళ లోపు బాలికలు 219మంది అదృశ్యమయ్యారు.అదే ఏడాది 240మంది ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. 18 ఏళ్ళు, ఆపై వయసున్న యువతులు, మహిళలు 360మంది అదృశ్యం కాగా 347మంది ఆచూకీ తెలిసింది.ఈ రెండు కేటగిరీల్లో కలిపి ఆ ఏడాది 579మంది అదృశ్యమైనట్లు ఫిర్యాదులు అందగా 587మంది ఆచూకీని పోలీసులు కనుగొన్నారు.

2020లో 931మంది గల్లంతు

2020లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 18ఏళ్ళ లోపు బాలికలు 349మంది అదృశ్యమైతే ఆ ఏడాదిలో 347మంది ఆచూకీ తెలిసింది. 18ఏళ్ళ యువతులు, అంతకు పైబడిన వయసు కలిగిన మహిళలు 582మంది ఆచూకీ గల్లంతు కాగా 605మంది ఆచూకీని కనుగొన్నారు. ఆ ఏడాది బాలికలు, యువతులు, మహిళలూ కలిపి 931మంది అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదులందితే 952మందిని ట్రేస్ చేయగలిగారు.

2021లో 1085మంది మాయం

2021లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 412మంది బాలికలు కనిపించకుండా పోగా ఆ ఏడాదిలో 428మంది బాలికల ఆచూకీని కనిపెట్టగలిగారు. అలాగే 673మంది యువతులు, మహిళలు గల్లంతు కాగా 717మంది ఆచూకీ వెల్లడైంది. ఆ ఏడాది మొత్తంగా 1085మంది బాలికలు, యువతులు, మహిళలు కనిపించకుండా పోగా 1145మంది ఆచూకీ తెలిసింది.

2022లో కనిపించకుండా పోయిన 615మంది

2022లో కొత్త జిల్లాల ప్రాతిపదికన తిరుపతి జిల్లాలో 217మంది బాలికలు గల్లంతు కాగా 211మంది ఆచూకీ కనిపెట్టారు.398మంది యువతులు,మహిళలు కనిపించకుండా పోగా 425మంది ఆచూకీ తెలిసింది. ఆ ఏడాది మొత్తంగా 615మంది అదృశ్యమైతే 636మంది ఆచూకీని కనిపెట్టారు.

2023లో 536మంది మిస్సింగ్

2023లో 192మంది బాలికలు అదృశ్యం కాగా 194మంది ఆచూకీ తెలిసింది. 344మంది యువతులు, మహిళలు గల్లంతు కాగా 324మంది ట్రేస్ అయ్యారు. మొత్తం 536మంది కనిపించకుండా పోగా 518 మందిని కనిపెట్టారు.

ఐదేళ్ళలో 3746మంది అదృశ్యంపై ఫిర్యాదులు

గడచిన ఐదేళ్ళలో జిల్లానుంచీ 3746మంది కనిపించకుండా పోయారని పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఇందులో కేటగిరీ వారీగా చూస్తే 1389మంది బాలికలు గల్లంతు కాగా అదే కేటగిరీలో 1420మంది ఆచూకీ తెలిసింది. అలాగే 2357మంది యువతులు, మహిళలు ఆచూకీ తెలియలేదని ఫిర్యాదులందగా ఆ ఏడాదిలోనే 2418మంది ఆచూకీ తెలిసింది. మొత్తంగా ఐదేళ్ళలో ఈ రెండు కేటగిరీలూ కలిపి 3746మంది అదృశ్యం కాగా 3848మంది ఆచూకీ తెలిసింది. మంగళవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, బీకే పార్థసారథి దీనిపై లిఖితపూర్వక ప్రశ్నలు వేయగా కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పై వివరాలు వెల్లడించారు.

చెంగాళమ్మ దేవస్థానం ఈవో సస్పెన్షన్



సస్పెండైన ఈవో వెంకటేశ్వర్లు

తడ, జూలై 30 : అవినీతి ఆరోపణల నేపథ్యంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు సస్పెండయ్యారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని కామాక్షమ్మ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల గోల్‌మాల్ జరిగింది. కుంభాభిషేకం, కోటి కుంకుమార్చన పేరుతో పాలకులు రూ.కోట్లు భోంచేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దాతల విరాళాల లెక్కలు కూడా గల్లంతయ్యాయనే ఫిర్యాదులందడంతో ఇటీవల దేవదాయ శాఖ ఉన్నతాధికారులు మూడు రోజులపాటు విచారించారు. సుమారు 3 కోట్ల రూపాయల మేర అవినీతి జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం.ఈ అవినీతిలో ముఖ్య పాత్రధారులు వైసీపీ ప్రాపకంతో పాలకమండలి పదవులు వెలగబెట్టిన వారే కాగా, అప్పట్లో పనిచేసిన ఈవోలు కూడా తాము ఆలయ పరిరక్షకులమని మరిచిపోయి అధికార పార్టీ నాయకులకు సాగిలపడ్డారు. ఆ గోల్‌మాల్‌కు జొన్నవాడ ఆలయ పూర్వ ఈవో, ప్రస్తుత చెంగాళమ్మ ఆలయ ఈవోగా పనిచేస్తున్న డబ్బుగుంట వెంకటేశ్వర్లుతోపాటు మరో నలుగురు కార్యనిర్వాహణాధికారులు వి. గిరికృష్ణ, మల్లికార్జున రెడ్డి, జానకమ్మ, కెవిటి ప్రసాద్‌లపై క్రమశిక్షణ చర్యలకు విచారణ అధికారులు సిఫారసు చేసినట్లు సమాచారం. ఆ మేరకు మంగళవారం సదరు అధికారులపై దేవదాయ శాఖ కమిషనర్ సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆక్రమణలో వైష్ణవాలయం



వైష్ణవాలయ పరిశీలన



మహావిష్ణువు విగ్రహం

వాకాడు, జూలై 30 : వాకాడు మండలం తిరుమూరులో శిథిలావస్థలో ఉన్న వైష్ణవాలయంలోని మహావిష్ణువు విగ్రహాన్ని మంగళవారం పురావస్తు శాఖ ఏడీ శివకుమార్, చరిత్రకారుడు తపతి, ఎండోమెంట్ అధికారి శశాంక్, గూడూరు ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు డాక్టర్ గోవిందు సురేంద్ర, వినోద్ పరిశీలించారు. ఈ సందర్భంగా గోవిందసురేంద్ర మాట్లాడుతూ మైసూరు పురావస్తుశాఖ శాసన అధికారి డాక్టర్ మునిరత్నం ఆదేశాల మేరకు ఆలయాన్ని పరిశీలించామన్నారు.తిరుమూరులో శివాలయం, అమ్మవారి ఆలయాలు నిత్యం దీపధూప నైవేద్యాలు అందుకుంటున్నాయని గుర్తించామన్నారు.ఆక్రమణకు గురై శిథిలావస్థకు చేరిన వైష్ణవాలయాన్ని పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, దాతలు ముందుకు రావాలన్నారు. తిరుమూరు సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు కుంచం చిన్నవెంకటరమణయ్య, సుందరం, మదార్‌సాహెబ్, పంచాయతీ కార్యదర్శి తిరుమూరు సురేష్ వారి వెంట వున్నారు.

పురావస్తు ఆనవాళ్లకు గుర్తింపు తెస్తాం

కోట, జూలై 30 : కోట మండలం కొత్తపట్నం చిట్టేడు గ్రామంలో ఉన్న రాజులకాలంనాటి కట్టడాలను వెలుగులోకి తీసుకువస్తామని చరిత్రకారుడు తపతి, గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ గోవిందు సురేంద్ర అన్నారు.కొత్తపట్నంలో పల్లవులు, చోళులు నిర్మించిన కట్టడాల ఆనవాళ్లున్నాయన్నారు. వైష్ణవాలయం శిథిలావస్థలో ఉన్నందున ఆనవాళ్ల వెలికితీసేందుకు అవకాశం లేకుండాపోయిందన్నారు.చిట్టేడు చెరువులో పలు కట్టడాలు, పొలాల్లో నిర్మించివున్న అతి పురాతన అమ్మవారి కోనేరు ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నాయాలేవా తెలుసుకుంటామన్నారు.



చిట్టేడు చెరువులో కోనేరును పరిశీలిస్తున్న డాక్టర్ గోవిందు సురేంద్ర

ఉపాధి పనుల్లో అవకతవకలు

23మంది సిబ్బంది సస్పెన్షన్

చిల్లకూరు, జూలై 30:చిల్లకూరు మండలంలో 2023-24వ ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన 23మంది సిబ్బందిని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సస్పెండ్ చేశారు. మంగళవారం చిల్లకూరు మండల కార్యాలయ సమీపంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఉపాధి పనులకు సంబంధించి తనిఖీలు, గ్రామసభలు నిర్వహించి తయారు చేసిన నివేదికలను ప్రజావేదికలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ రూ. 16,56,33,689విలువైన పనులు జరగ్గా రూ. 2,66,56,677లకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు గుర్తించడం జరిగిందన్నారు. 9,03,478 రూపాయలు రికవరీ, 1,28,500 రూపాయలు పెనాల్టీ వేయడం జరిగిందన్నారు.అవకతవకలకు పాల్పడిన కలవకొండ, పారిచర్లవారిపాళెం, తమ్మినపట్నం, వరగలి, ఏరూరు, కడివేడు, బూదనం, ఓడూరు, ఎగువరాజుపాళెం, మోమిడి, చేడిమాల, తూర్పుకనుపూరు, నెలబల్లిరెట్టపల్లి, ముత్యాలపాడు, తీపనూరు, బల్లవోలు గ్రామాలకు చెందిన 16మంది ఎఫ్ఏలను, ఐదుగురు టీఏలను, ఇద్దరు జేఈలను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. క్వాలిటీకంట్రోల్ డీఈ వేణుగోపాల్, ఏపీడీ వరప్రసాద్, ఎస్‌టీఎం కోనయ్య, ఎంపీడీవో భానుమూర్తిరావు, ఎస్ఆర్పీ రవి, ఏపీవో గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

ఆరేళ్ల చిన్నారిపై వృద్ధుడి అత్యాచారయత్నం

చిల్లకూరు, జూలై 30:ఆరేళ్ల చిన్నారిపై 70 ఏళ్ల వృద్ధుడు అత్యాచారయత్నానికి పాల్పడిన వృదంతమిది. పోలీసుల కథనం మేరకు...చిల్లకూరు మండలంలోని ఓ పాఠశాల వద్ద ఆరేళ్ల చిన్నారి ఆడుకుంటుండగా వెంకటయ్య అనే వృద్ధుడు తినుబండారాలు ఇస్తానని ఆశ చూపాడు. సమీపంలోని ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి ప్రయత్నించాడు. చిన్నారి తల్లిదండ్రులకు విషయం తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోక్సో చట్టంకింద పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ల పోస్టింగ్స్‌పై సర్కారు కొత్త నిబంధనలు

- ఎన్నికల ముందు పనిచేసిన మండలం, సొంత రెవెన్యూ డివిజన్, నియోజకవర్గంలో ఇవ్వరు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30: ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి సొంత జిల్లాకు వచ్చే 42 మంది తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇచ్చే విషయమై సర్కారు కొత్త నిబంధనలు విధించింది. ఎన్నికల ముందు పనిచేసిన మండలం, సొంత రెవెన్యూ డివిజన్, నియోజకవర్గ పరిధిలో పోస్టింగ్ ఇవ్వకూడదని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను మంగళవారం రాత్రి అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపింది. ఇందుకోసం నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో కమిటీ వేసింది. ఈ కమిటీ నిర్ణయం మేరకు పోస్టింగ్స్ ఉంటాయి. ఈ లెక్కన చూస్తే చాలామంది తహసీల్దార్లు పక్క జిల్లాకు వెళ్లే పరిస్థితి కనబడుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీతో అంటకాగిన తహసీల్దార్ల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయ్యింది.

డ్రైనేజీ నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, జూలై 30: శ్రామికనగర్‌లో డ్రైనేజీ నీరు కాలువల్లోకి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు శివకుమార్ అన్నారు. మంగళవారం శ్రామినగర్ సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జక్కావెంకయ్య శ్రామికనగర్ ప్రాంతంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సీసీరోడ్లు నిర్మించారన్నారు. కాలనీలోని డ్రైనేజీ నీరు ప్రధాన కాలువలో కలిసే ప్రాంతంలో ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం అడ్డుగా గోడ నిర్మాణం చేపట్టిందన్నారు. దీంతో మురుగునీరు నివాసాల మధ్య నిల్వ చేరుతుండడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువ మురుగునీరు సజావుగా ప్రధాన కాలువలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, బీవీరమణయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులకు
ప్రత్యేక అధికారం కల్పించాలి

పెళ్లకూరు, జూలై 30 : సర్పంచులు, ఎంపీటీసీలు, జట్పీటీసీలకు ప్రత్యేక అధికారం కల్పించాలని తీర్మానించి ప్రభుత్వానికి సిఫారుసు లేఖ పంపించినట్లు రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన బంగారంపేటలో విలేకర్లతో మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీ, జిల్లా పరిషత్ ఛైర్మన్, నగర, మున్సిపల్ ఛైర్ పర్సన్‌లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఒక నెల గౌరవ వేతనాన్ని అమరావతి అభివృద్ధికి విరాళంగా ఇవ్వాలని తీర్మానించారన్నారు. గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయాలని ప్రభుత్వాని కోరినట్లు తెలిపారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం



వరిపంటను పరిశీలిస్తున్న కేవీ శ్రీనివాస్

పెళ్లకూరు, జూలై 30 : చిరుధాన్యాల సాగు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి కేవీ శ్రీనివాస్ తెలిపారు. నెలబల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం చిరుధాన్యాల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తక్కువ పెట్టుబడులతో రాగి, సజ్జ, కొర్రలు, సాములు తదితర చిరుధాన్యాల పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు. ప్రభు త్వం చిరుధాన్యాల విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందిస్తుందన్నారు. రైతులు పండించిన పంటలను రైతు సేవా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి గొడవర్తి ప్రవీణ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా తగు మోతాదులో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన డ్వామా పీడీ



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

పెళ్లకూరు, జూలై 30 : మండలంలోని నెలబల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని అక్కగారిపేట వద్ద ఉన్న తుమ్మానుగుంట పూడికతీత పనులను పరిశీలించి కూలీల మస్టర్లను తనిఖీ చేసి నగదు చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో దయానందం, ఈసీ భాస్కర్‌రావు, టెక్నికల్ అసిస్టెంట్ గోవర్ధన్, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపాలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



కోట, జూలై 30 : కోటలోని షిరిడీసాయి అక్షయ సేవా సమితి కార్యాలయంలో మంగళవారం నిరుపేద వృద్ధ మహిళకు దాతల సహకారంతో ఆదుకున్నారు. నాయుడుపేట మండలం అన్నమేడుకు చెందిన అనిత ఇటీవల భర్త చనిపోయి పిల్లలను పోషించుకుంటోంది. ఆమె కుటుంబానికి ఆసరాగా హైదరాబాదుకు చెందిన ఓరుగంటి సుధాకర్‌శర్మ దాతృత్వంతో షిరిడీసాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య చేతుల మీదుగా 10 వేల రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో హేమంత్‌కుమార్‌శర్మ, దీవీ అనంతాచార్యులు, రంగనాథాచార్యులు దామోదర్, సాయిబాబా, పన్నగ సాయి తదితరులు ఉన్నారు.

సిబ్బంది కొరతతో షిఫ్ట్ డ్యూటీల్లో సమస్య

● వైద్యాధికారి రామాంజనేయులు

చిట్టమూరు, జులై 30 : గునపాటిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత కారణంగా విధుల్లో కొంత ఇబ్బందులున్నాయని వైద్యాధికారి రామాంజనేయులు అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన రిలీవర్ కాక ముందే ఇంటికి అనే వార్తకు వైద్యాధికారి స్పందించారు. తాను నాలుగు గంటల వరకు డ్యూటీలో ఉండి వెళ్లానన్నారు. సిబ్బంది కొరత కారణంగా షిఫ్ట్ డ్యూటీల్లో సమస్య వచ్చిందన్నారు. ఆసుపత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పొదుపు సంఘాలతో సమీక్ష

తడ: పొదుపు సంఘాల పనితీరు, స్త్రీనిధి రికవరీలపై మంగళవారం డీఆర్‌డీఏ డీడీ ప్రభావతి సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో ఆమె బీవోఏ, సీసీలతో సమావేశం నిర్వహించారు. బ్యాంక్ ఖాతాల అనుసంధానాల వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.

వైభవంగా ఆడికృత్తిక వేడుకలు



వేలాయుధాలతో నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు, కోటలో పూజలు అందుకుంటున్న బాలసుబ్రహ్మణేశ్వరుడు

నాయుడుపేట టౌన్, జూలై 30 : పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛారణల నడుమ 108 వేలాయుధాలతో పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే మండలంలోని చిగురుపాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజల అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వెంకటగిరిటౌన్ : ఆడికృత్తిక పురస్కరించుకుని పట్టణంలోని ఆత్మమాలిక్ ఆధ్వర్యంలో సుబ్రమణ్య స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. సుబ్రమణ్య స్వామిని పురవీధుల్లో 108కలశాలతో గ్రామోత్సవం చేశారు.

చిట్టమూరు : మండల పరిధిలోని మల్లాం శ్రీవల్లీ, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆడికృత్తిక వేడుకలు జరిగాయి. ఆలయ కమిటీ ఛైర్మన్ చిల్లకూరు సాయికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు కుటుంబ సమేతంగా నూరు స్థంభాల కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకాల్లో పాల్గొన్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదం అందించారు. అరవపాళెం సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కోదండ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆడికృత్తిక వేడుకలు జరిగాయి.

కోట : కోట పట్టణంలో మంగళవారం ఆడికృత్రిక సంబరాలు జరిగాయి. స్థానిక లింగాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న బాలసుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పలు అభిషేకాలు చేసి కోట మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు కావడిలు తీసుకొని హరోహరా అంటూ నినాదాలు చేస్తూ కావడిలు మోసి మొక్కులు తీర్చుకున్నారు.



వెంకటగిరిలో కళాకారుల కేరళ వాయిద్యాలు, విశేష అలంకరణలో షణ్ముఖ స్వామి

సుందరమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు, జూలై 30: చిల్లకూరు దళితవాడలోని సుందరమ్మ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆగస్టు 9,10,11 తేదీల్లో జరిగే తిరునాళ్లలో భాగంగా రెండో మంగళవారం అమ్మవారికి అంబలి పోసే కార్యక్రమం నిర్వహించారు. తప్పెట్లు వాయించుకుంటూ, యువకుల నృత్యాల నడుమ మహిళా భక్తులు సామూహికంగా అమ్మవారి ఆలయం వద్దకు అంబలి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం పూజలు నిర్వహించారు.



ప్రత్యేకాలంకరణలో సుందరమ్మ, అంబలి పోస్తున్న భక్తులు

ఎస్సీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి : చింతా

గూడూరు, జూలై 30: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం అయిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు దారి మళ్లించి ఎస్సీలను అధోగతిపాలు చేశారన్నారు. ఈ ప్రభుత్వమైన నిధులు మంజూరు చేసి ఎస్సీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. వైసీపీ వలన ఆంధ్రప్రదేశ్ అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థ అధ్వానంగా మారిందన్నారు. మదనపల్లిలో వేల ఎకరాల ఎస్సీ భూములను దోచుకునేందుకు కుట్రతో ఫైళ్లను కాల్చివేశారన్నారు. ఇండియా కూటమికి జగన్ అవసరం ఏ మాత్రం లేదన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న చింతామోహన్

సూళ్లూరుపేట : రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. మంగళవారం ఆయన ఆర్డీవో కార్యాలయం వద్ద ఎస్సీ కార్పొరేషన్‌ను ప్రారంభించాలని నిరసన చేశారు. నాయకులు చందనమూడి శివ, కన్నంబాకం హరికృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

● కౌన్సిల్ సమావేశంలో ఛైర్ పర్సన్ కటకం దీపిక

నాయుడుపేట, జూలై 30 : నాయుడుపేట మున్సిపాలిటీలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 25 వార్డుల్లో అభివృద్ధి పనులకు రూ.2 కోట్ల ప్రతిపాదనలను కౌన్సిలర్లు ఆమోదించినట్లు ఆమె తెలిపారు. అనంతరం కోఆప్షన్ సభ్యుడు చదలవాడ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో ఆక్రమణల తొలగింపు విషయంలో సంబంధిత అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని కోరారు. అలాగే పట్టణంలో దోమల బెడద ఎక్కువై ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లారు. మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్ పర్సన్ కటకం దీపిక

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్

నాయుడుపేట టౌన్, జూలై 30 : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంటలను రైతులు పండించవచ్చని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని అన్నమేడులో మంగళవారం ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతిలో రైతులు అవలంబించాల్సిన పద్ధతులను, కషాయాల వాడకం గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఆ రైతులకు అధిక లాభాలు చేకూరుతాయన్నారు. వ్యవసాయశాఖ అధికారి గణేష్ మాట్లాడుతూ పశువుల ఎరువు, పచ్చరొట్ట ఎరువులతో పంటలు సాగుచేయడం వలన ఉపయోగాలు ఉంటాయన్నారు. కార్య క్రమంలో ఉద్యానవన అధికారి శారద, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో షార్ ఉద్యోగి దుర్మరణం



మృతి చెందిన షార్ ఉద్యోగి నరేంద్ర, మృతుడి భార్య, బంధువులతో మాట్లాడుతున్న షార్ గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ

సూళ్లూరుపేట, జూలై30: సూళ్లూరుపేట సమీపంలోని పిండిపాలెం క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షార్ ఉద్యోగి మలిశెట్టి నరేంద్ర (37) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు షార్‌లోని కంప్యూటర్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న నరేంద్ర మోటారు సైకిల్‌పై సూళ్లూరుపేట వస్తుండగా పిండిపాలెం క్రాస్ రోడ్డు వద్ద వున్న దాబాహోటల్ వద్ద ఆగివున్న లారీని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జేబులో ఉన్న ఆధార్ కార్డు, లైసెన్సు ఆధారంగా అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం వెంకటరాజు పల్లికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. నరేంద్ర షార్‌లో పనిచేస్తూ సూళ్లూరుపేట సమీపంలోని షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్ పాలెంలో నివాసం ఉంటున్నాడు. ఉదయం ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై డ్యూటీకి వెళ్లి మధ్నాహ్నం ఇంటికి వచ్చినట్లు ఆయన బంధువులు తెలిపారు. తిరిగి డ్యూటీకి వెళ్తున్నట్లు చెప్పిన ఆయన ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఎందుకు వెళ్లాడనేది తమకు తెలియడం లేదని ఆయన భార్య, బంధువులు పోలీస్ స్టేషన్ వద్ద కన్నీరు మున్నీరయ్యారు. మధ్నాహ్నం డ్యూటీకని వెళ్లిన నరేంద్ర రాత్రి 9 గంటల వరకు ఇంటికి రాకపోవడంతో అనుమానమొచ్చిందన్నారు మృతి చెందిన విషయాన్ని సోషల్ మీడియాలో తెలుసుకొని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. షార్ గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని మృతుడి భార్య, బంధువులను ఓదార్చారు. సీఐ మధుబాబుతో మాట్లాడారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీవోఏల తొలగింపు అన్యాయం

బాలాయపల్లి, జూలై 30: స్థానిక నాయకుల ఒత్తిడితో వీవోఏల తొలగింపు చర్యలు అన్యాయం అని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. మంగళవారం బాలాయపల్లి మండలంలోని మన్నూరు, కయ్యూరు, నిండలి, అలిమిలి గ్రామ పంచాయతీల్లో వేధింపులకు గురవుతున్న వీవోఏలు ఏఐటీయూసీ నాయకులతో కలసి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీవోఏలను తొలగించేందుకు ఆయా గ్రామాల్లోని నాయకులు అధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నారని తెలియజేశారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ చిరుద్యోగులకు అండగా ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి రాదాకృష్ణ, ప్రధాన కార్యదర్శి కల్లూరు జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆవుల అపహరణ

బాలాయపల్లి, జూలై 30: మండలంలోని వెంగమాంబపురం, యాచవరం, పచ్చారు చేను గ్రామాల్లో ఒకే రోజు నాలుగు ఆవులు అపహరణకు గురయ్యాయి. వెంగమాంబపురానికి చెందిన దామా గురుమూర్తి, పచ్చారుచేను గ్రామానికి చెందిన ఉప్పు శ్రీనివాసులు, యాచవరం ఎస్సీ కాలనీకి చెందిన రాజేశ్వరి, ఈశ్వరయ్యలకు చెందిన ఆవులు ఒకే రాత్రి అపహరణకు గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



గూడూరు అర్బన్, జూలై 30: స్థానిక జీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం యూనిఫాం పంపిణీ చేసిందన్నారు. ఈ దస్తులను కుట్టించుకునే స్తోమత లేని విద్యార్థులను గుర్తించి తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటిని కుట్టించి విద్యార్థులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో మృదుల, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కూలీ ఆత్మహత్య



గూడూరు అర్బన్, జూలై 30: మండలంలోని చంబడిపాళెంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... చంబడిపాళెంలో కొండయ్య(38) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు మద్యానికి బానిసైన కొండయ్య కుటుంబ కలహాల కారణంగా మంగళవారం ఇంట్లో పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్సనిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షా సప్తాహ విజయవంతం

పెళ్లకూరు, జూలై 30: మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యావారోత్సవాలలో భాగంగా శిక్షా సప్తాహ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎంఈవో మించల శంకరయ్య తెలిపారు. తొలి రోజు బోధన సామగ్రి ప్రదర్శనతో ప్రారంభమై పునాది అభ్యసన, క్రీడా దినోత్సవం, సాంస్కృతిక దినోత్సవం, సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, పర్యావరణ పరిరక్షణ దినోత్సవం, సామాజిక భాగస్వామ్య దినోత్సవం తదితర కార్యక్రమాలను చేపట్టామన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

గూడూరు, జూలై 30: ఆయిల్‌పామ్ సాగుచేయడం ద్వారా రైతులు అధిక లాభాలను పొందవచ్చునని మండల ఉద్యానవనశాఖ అధికారి కార్తీక్ అన్నారు. మంగళవారం మండలంలోని కొండాగుంట, పారిచెర్ల గ్రామాల్లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులు హెక్టార్‌కు 150 మొక్కలు నాటుకోవాలన్నారు. రైతులకు హెక్టారుకు ప్రభుత్వం రూ. 39,500 రాయితీ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సాయికృష్ణ, మమత, శివ, ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే
పింఛన్లు పంపిణీ చేయాలి

తడ, జూలై 30 : సామాజిక పింఛన్లను 1వ తేదీనే లబ్ధిదారులకు పంపిణీ చేసేలా సచివాలయ ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయకుమార్ ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే ప్రతి ఒక్క లబ్ధిదారునికి పింఛన్ అందేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఆ మేరకు అదేరోజు పూర్తిస్థాయిలో ప్రతి ఒక్క లబ్ధిదారునికి పింఛన్లను పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే ఇంటి పన్నుల వసూళ్లు, ఓడీఎఫ్ సర్వే వంటి విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ శాఖ ఏఈ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు శేషారావు, గాబ్రియల్, మస్తాన్, సురేష్, శ్రీనివాసులు, శివశంకర్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్‌లో పరిశీలన

కోట, జూలై 30 : కోట మండలం విద్యానగర్‌లోని యూనియన్ బ్యాంక్‌లో మంగళవారం బ్యాంక్ సేఫ్టీ అధికారులు పరిశీలన చేశారు. సోమవారం బ్యాంక్‌లో అగ్నిప్రమాదం జరిగి కంప్యూటర్లు, రికార్డులు కాలిపోయిన సంగతి తెలిసిందే. బ్యాంక్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. అదేవిధంగా నెల్లూరు యూనియన్ బ్యాంక్ రీజినల్ ఆఫీసు నుంచి ఉన్నతాధికారులు వచ్చి ప్రమాద ఘటనపై ఆరాతీసి పలు రికార్డులను పరిశీలించారు.

గిరిజన కుటుంబానికి చేయూత

నాయుడుపేట, జూలై30:నాయుడుపేట మున్సిపాలిటీలోని 5వ వార్డు శ్రీనివాసపురానికి చెందిన తుపాకుల రమణయ్యకు మంగళవారం టీడీపీ నాయకుడు పనబాక గంగబాబు చేయూత అందించారు. పక్షవాతానికి గురైన రమణయ్యకు అతడి భార్య సుబ్బమ్మ వైద్యం, భోజనం అందిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. సుబ్బమ్మకు బుధవారం ఉత్తరక్రియలకు అవసరమగు బియ్యం, కూరగాయలు, పప్పు దినుసులు, నూనెలను పనబాక భూలక్ష్మి సేవాసమితి ద్వారా వారికి గంగబాబు అందజేశారు.